ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

ఏలూరు

జిల్లా వార్తలు

7

ఆదివారం 26 జనవరి 2025





ఏలూరులో 2కే రన్‌లో పాల్గొన్న కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి

## ఓటు ప్రాధాన్యత గుర్తించాలి

### కలెక్టర్ వెట్రిసెల్వి.. ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

ఏలూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రతీ ఒక్కరూ గుర్తెరిగి నడుచుకోవాలని, 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటరుగా నమోదు కావడం తమ హక్కుగా భావించాలని కలెక్టర్ వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టర్ శనివారం సమావేశం నిర్వహించి, జిల్లా అధికారులు, విద్యార్థులు, కలెక్టరేట్ సిబ్బందితో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. సీనియర్ సిటిజన్ ఓటరులైన దేవరపల్లి కుటుంబరావు, బి.దమయంతి, ఇందుకూరి వెంకటలక్ష్మీ పతిరాజులను సన్మానించారు. కొత్తగా ఓటరుగా నమోదైన యువతకు ఓటరు ఐడీ కార్డులను, వివిధ పోటీల్లో విజేత కు బహుమతులను సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఓటరు నమోదు, నమూనా మోడరన్ పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. డీఆర్వో విశ్వేశ్వరరావు, ఆర్డీవో అచ్యుత అంబరీష్, జడ్పీ సీఈవో సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, సెట్వెల్ సీఈవో ప్రభాకర్‌రావు, తహసీల్దార్ శేషగిరి, కలెక్టరేట్ ఏవో నాంచారయ్య పాల్గొన్నారు. కాగా ఓటర్లను చైతన్యం చేయడానికి ఇండోర్ స్టేడియం నుంచి ఫైర్ స్టేషన్, డీఈవో ఆఫీసు మీదుగా ఇండోర్ స్టేడియం వరకు 2కే రన్ ప్రదర్శనను కలెక్టర్ ప్రారంభించి పాల్గొన్నారు. జేసీ ధాత్రిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సీనియర్ సిటిజన్స్‌ను సన్మానిస్తున్న కలెక్టర్

## ఏలూరు జిల్లా జైలు వార్డర్‌కు రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం

ఏలూరు క్రైం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : జైలులో ఉన్న ఖైదీలను సత్ప్రవర్తన కల్పించే విధంగా దిద్దుబాటు సేవలు (కరెక్షనల్ సర్వీస్) అందించినందుకు గుర్తింపుగా రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం ఏలూరు జిల్లా జైలులో పనిచేస్తున్న జైలు వార్డర్ ఉండ్రాజవరపు వీర వెంకట సత్యనారాయణకు కేంద్ర ప్రభుత్వం గణతంత్ర దినోత్సవం సందర్భంగా శనివారం ప్రకటించింది. జైళ్లశాఖ నుంచి రాష్ట్రంలో ఇద్దరికి ఈ సేవా పతకాలు లభించాయి. ఒకరు ఒంగోలులో జైలులో చీఫ్ ఎడ్‌వార్డర్‌గా పనిచేస్తున్న కడలి అర్జున్‌రావుకు, ఏలూరు జిల్లా జైలులో వార్డర్‌గా పనిచేస్తున్న సత్యనారాయణలకు మాత్రమే మన రాష్ట్రం తరపున పతకాలను పొందారు. ఉండ్రాజవరపు వీర వెంకట సత్యనారాయణది కోనసీమ అంబేడ్కర్ జిల్లా, మామిడికుదురు స్వస్థలం. 1999లో జైళ్ల శాఖలో వార్డర్‌గా ఎంపికై చెంచల్‌గూడ సెంట్రల్ జైలు, నంద్యాల జిల్లా జైళ్లల్లో పనిచేసి గత ఐదేళ్ల నుంచి ఏలూరు జిల్లా జైలులో జైలు వార్డర్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జైలులోని రిమాండ్ ఖైదీలు, శిక్షపడ్డ ఖైదీలకు సత్ప్రవర్తన కలిగించేందుకు సత్యనారాయణ ఎంతో కృషి చేసి మెరుగైన సేవలు అందించారు. దిద్దుబాటు సేవలు అందించడంలో కీర్తిగడించడంతో ఏలూరు జిల్లా జైలు సూపరింటెండెంట్ సీహెచ్‌ఆర్‌వీ స్వామి గతంలో రాష్ట్ర జైళ్లశాఖ డీజీ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో సత్యనారాయణ సేవలను పరిశీలించి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. కేంద్రం పూర్తిస్థాయిలో పరిశీలన జరిపి సత్యనారాయణకు అత్యున్నతమైన రాష్ట్రపతి సర్వీస్ మెడల్‌ను వార్డర్ సత్యనారాయణకు ప్రకటించింది. దీంతో ఆయనకు జిల్లా జైలు సూపరింటెండెంట్ సీహెచ్‌ఆర్‌వీ స్వామి, తోటి ఉద్యోగులు, అధికారులు అభినందనలు తెలిపారు. అందరి సహకారంతోనే ఈ అవార్డు రావడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని సత్యనారాయణ చెప్పారు.



ఉండ్రాజవరపు వీరవెంకట సత్యనారాయణ



ఐక్యతను చాటుతున్న ప్రజాప్రతినిధులు

# కొల్లేరు ప్రజలకు.. అండగా ఉంటాం!

కైకలూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : కొల్లేరు ప్రజల జీవనోపాధిని కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా ఉంటాయని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్, కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. కైకలూరులో శనివారం కొల్లేరు ప్రజల ఐక్యత బహిరంగ సభను నిర్వహించారు. సభలో కొల్లేరు ప్రజల సంక్షేమానికి ఐక్యతతోనే పోరాటం చేసి సమస్య పరిష్కరమయ్యేలా కృషి చేయాలని తీర్మానించారు. సభకు మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా నుంచి కొల్లేరు గ్రామాల ప్రజలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ ప్రజా ప్రతినిధులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## కైకలూరులో కొల్లేరు ప్రజల ఐక్యవేదిక బహిరంగ సభ

- ప్రజల పక్షాన సుప్రీంకోర్టులో వాదనలు వినిపిస్తాం
- పర్యావరణంతో పాటు ప్రజలు అవసరమే..
- జిరాయితీ, సొసైటీ భూములను ఇప్పించేందుకు కృషి
- కొల్లేరు ప్రజలకు ప్రజా ప్రతినిధుల భరోసా
- భారీగా తరలివచ్చిన కొల్లేరు ప్రజలు

### కొల్లేరు ప్రజల పరిరక్షణకు కృషి

**పుట్టా మహేశ్ కుమార్ యాదవ్, ఏలూరు ఎంపీ**



కొల్లేరు ప్రజల పరిరక్షణకు కృషి చేస్తాం. ఎన్నికల్లో ఇచ్చి న హామీ మేరకు వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు పోరాడతాం. ఒక్క చెరువు కూడా కొట్టకుండా పోరాటం చేసి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తాం. చెరువులను ధ్వంసం చేయకుండా ఇప్పటికే నిలుపుదల చేశాం. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి ఢిల్లీలో పోరాటం చేస్తా.

### కొల్లేరు ప్రజల సమస్య తీరుస్తాం..

**కామినేని శ్రీనివాస్, కైకలూరు ఎమ్మెల్యే**



కొల్లేరు ప్రజల సమస్య తీర్చేలా కృషి చేస్తా. ఇకపై కొల్లేరు ప్రజలు ఎవరిపైనా ఆధారపడకుండా స్వేచ్ఛగా జీవించేలా శాశ్వత పరిష్కారానికి ఐక్యతతో పోరాటం చేద్దాం. సుప్రీంకోర్టులో కొల్లేరు ప్రజల తరపున వాదనలు వినిపించేందుకు ఎంపీ మహేశ్‌తో పాటు, డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామ కృష్ణంరాజు న్యాయపోరాటం చేస్తారు. పర్యావరణం, పక్షులతో పాటు ప్రజల జీవించాల్సిన అవసర ముంది. అందుకోసం గతంలో ప్రతిపాదించిన 14 వేల ఎకరాల జిరాయితీలు, ఏడు వేల ఎకరాల సొసైటీల భూములు కాంటూరు నుంచి బయటకు తీసుకొచ్చి ప్రజలకు అందించాలి. పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూ టూరిజం అభివృద్ధి చేసేలా ప్రభుత్వం కృషి చేస్తుంది. కొల్లేరు డ్రెయిన్లతో పాటు ఉప్పుటేరు ఆక్రమణలను తొలగిస్తాం.

### ఆందోళన చెందవద్దు..

**చింతమనేని ప్రభాకర్, దెందులూరు ఎమ్మెల్యే**



కొల్లేరు చెరువుల ధ్వంసంపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఇక్కడ ప్రజలు జీవన పరిస్థితులను సుప్రీం కోర్టు దృష్టికి తీసుకువెళ్లి ప్రజలను రక్షించుకునే పనిచేస్తాం. రైతులు ముసుగులో కొల్లేరులో బయట వ్యక్తులు చేపల సాగు చేస్తున్నారని కొంతమంది అపవాదులు సృష్టి స్తున్నారు. వీటిని తిప్పికొట్టేందుకు కోర్టులో వాదనలు వినిపించాల్సిన అవసరముంది. ఒకసారి కాంటూరు కుదింపు చేసి సరిహద్దులు నిర్ధారణ చేస్తే దానికి లోబడి సుప్రీంకోర్టు పరిధిలోకి తీసుకుంటుంది. ఆ దిశగా ప్రయత్నం చేస్తాం.

### కాంటూరు కుదింపు చేయాలి

**పత్సమట్ల ధర్మరాజు, ఉంగుటూరు ఎమ్మెల్యే**



కొల్లేరు కాంటూరును 77,138 ఎకరాల నుంచి 50 వేల ఎకరాలకు కుదింపు చేయాలి. గతంలోని జిరాయితీ భూములను, సొసైటీ భూములను ప్రజలకు అందిస్తే ప్రజలు జీవిం చేందుకు ఎంతో ఉపయోగపడతాయి. గత ప్రభుత్వ హయాంలో కొల్లేరు ప్రజల సంక్షేమానికి ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ప్రస్తుతం చెరువులను ధ్వంసం చేయకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిలుపుదల చేసేలా నాయకులంతా ఐక్యతతో సాధించుకోవాల్సి ఉంది.

### చేపలను పెంచుకునే హక్కు లేదా..?

**జయమంగళ వెంకటరమణ, ఎమ్మెల్సీ**



కొల్లేరులో పర్యావరణం పేరుతో ఎవరు కేసులు వేసినా వెంటనే చెరువులను ధ్వంసం చేస్తామంటున్నారు. అరకు అటవీ శాఖ ప్రాంతంలో ఉన్నప్పటికీ కాఫీ పంటను పండించుకునే హక్కు ఉన్నప్పుడు కొల్లేరులో ధ్వంసం చేసిన చెరువుల్లో చేపలు పెంచుకునే హక్కు లేదా..? అని ప్రశ్నించారు. మార్చి 31వ తేదీ నాటికి చెరువులను ధ్వంసం చేసే ప్రయత్నాలను అడ్డుకునే ప్రయత్నం చేయాలి. భూములను ఆక్రమించుకోవడం లక్ష్యం కాదని ప్రజలు జీవనోపాధి కల్పించడమే లక్ష్యంగా కాంటూరు కుదింపు చేయాలి. కొల్లేరు ప్రజలతో కలసి కాంటూరు కుదింపునకు కృషి చేస్తా. 15 వేల జిరాయితీ భూములను, కొల్లేరు ఆపరేషన్‌లో అక్రమంగా ధ్వంసం చేసిన 7500 ఎకరాలను ప్రజలకు ఇప్పించేవరకు పోరాటం చేస్తా.

### ఎకో సెన్సిటివ్‌జోన్ నుంచి కాపాడాలి..

**గన్ని వీరాంజనేయులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు**



కొల్లేరు కాంటూరు కుదింపుతో పాటు ఎకో సెన్సిటివ్‌జోన్ నుంచి కాపాడుకోకపోతే రానున్న రోజుల్లో ఇబ్బందులకు గురవుతాం. వీటిని సాధించుకునేందుకు అందరితో కలసికట్టుగా నేను పోరాటం చేస్తా. కాంటూరు కుదింపు సమస్య తీరకుండానే ఎకో సెన్సిటివ్‌జోన్ పేరుతో పుండుపై కారం చల్లినట్లుగా వ్యవహరిస్తున్నారు. కలిసికట్టుగా పోరాడి సమస్యను పరిష్కరిద్దాం.

### ఆ.. భూములను ఇప్పించండి

**బలే ఏసురాజు, టీడీపీ రాష్ట్ర వడ్డీ సాధికారిక సమితి కన్వీనర్**



గతంలో చేపలు సాగు చేసుకుని ప్రజలు జీవనోపాధిని పొందాలని అప్పటి ప్రభుత్వాలే చెరువులను తవ్వించాయి. పర్యావరణ పరిరక్షణ పేరుతో ప్రజల జీవనోపాధిని దెబ్బ తీస్తున్నారు. కొల్లేరు ఆపరేషన్ చేసి 20 ఏళ్లు అవుతున్నా ప్రజలకు ఏ విధమైన న్యాయం చేశారన్నది కోర్టులు, ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. కొల్లేరు ఆపరేషన్‌లో 7,500 ఎకరాల భూములు అదనంగా ధ్వంసం చేశారు. వారికి నష్టపరిహారం నేటికీ అందలేదు. కొల్లేరు సరస్సు మొత్తంలో 53 సొసైటీలు ఉండగా వాటిలో 33 సొసైటీలు లంక గ్రామాల్లోనే ఉన్నాయి. ఆ సొసైటీ భూములతో పాటు అదనంగా ధ్వంసం చేసిన 7500 ఎకరాల భూములను ప్రజలకు తిరిగి ఇప్పించాలి. చెరువులను ధ్వంసం చేసే ప్రయత్నాలు చేసినా కొల్లేరును వదిలి వెళ్లే ప్రసక్తే లేదు.

### పర్యావరణానికి వ్యతిరేకం కాదు...

**సైదు సత్యనారాయణ, కొల్లేరు సంఘ అధ్యక్షుడు**



పర్యావరణానికి, పక్షులకు కొల్లేరు ప్రజలు వ్యతిరేకం కాదు. వాటిని కాపాడుకుంటూనే 4లక్ష ల మంది ప్రజలకు జీవనోపాధి ని కల్పించాలి. పర్యావరణానికి అవసరమైన భూమిని ఉంచుకుని మిగిలినది ప్రజలకు అందిస్తే కొల్లేరు ప్రాంత ప్రజలకు న్యాయం చేసినట్లు అవుతుంది. మా భూములను మాకు ఇప్పించండి.

### ఐక్యతతో వాదనలు వినిపించాలి...

**ఘంటసాల వెంకటలక్ష్మి, జనసేన నాయకురాలు**



పర్యావరణం కోసం ఇతరులు కేసులు వేసినప్పటికీ దాని కౌంటర్ పిటీషన్‌లు కోర్టులో వేయలేకపోతున్నాం. ప్రజలంతా ఐక్యతతో ఉండి సుప్రీంకోర్టులో వాదనలు వినిపిస్తేనే సమస్యకు పరిష్కారమవుతుంది. లేకుంటే నిత్యం ప్రజలు భయపడుతూనే జీవనం సాగించాల్సి ఉంటుంది. కూటమి ప్రభుత్వం ప్రజల పక్షాన పోరాటం చేస్తుంది

### కొల్లేరు ప్రజలకు అండగా ఉంటాం

**నంబూరి వెంకటరామరాజు, రాష్ట్ర చేపల రైతుల సంఘం అధ్యక్షుడు**



కొల్లేరు సమస్యకు చట్టపరమైన ఇబ్బందులు లేకుండా తొలగించేందుకు కృషి చేయాలి. అందుకు అవసరమైతే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలి. ప్రజలకు జీవనోపాధిని కల్పించేందుకు రాష్ట్ర చేపల రైతుల సంఘం అండగా ఉంటుంది. కోర్టుల్లో వాదనలు వినిపించే అంశంలో మేము పోరాడతాం.

సభకు హాజరైన కొల్లేరు గ్రామాల ప్రజలు





## సాంఘిక వసతి గృహాలకు పూర్వవైభవం

- మరమ్మతులపై దృష్టి సారించిన ప్రభుత్వం
- భారీగా నిధులు మంజూరు
- విద్యార్థులకు తప్పనున్న ఇబ్బందులు

ఏలూరు రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వసతి గృహాలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. మరమ్మతు లకు గురైన వాటిని పరిశీలించి నివేదికలు అందించాలని ఆదేశించడంతో జిల్లాలోని 52 సాంఘిక వసతి గృహాల పరిస్థితిపై అధికారులు నివేదికలు పంపారు. దీంతో వాటి మరమ్మతులకు ప్రభుత్వం రూ.5.73 కోట్లు మంజూరు చేస్తూ తక్షణమే పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. పనులు పూర్తయితే సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహాల్లో విద్యార్థుల ఇక్కట్లు తొలగి వసతి గృహాలకు పూర్వవైభవం రానుంది.

జిల్లాలో 52 సాంఘిక వసతి గృహాలు ఉన్నాయి. వాటిలో సుమారు 6,192 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. వసతి గృహాల్లో సౌకర్యాల కల్పనపై గత వైసీపీ ప్రభుత్వం దృష్టి సారించలేదు. వసతి గృహాల భవనాలతో పాటు గదులు, వంటశాలలు, ప్రహరీలు, స్నానపు గదులు, మరుగుదొడ్లు అధ్వానంగా మారాయి. చాలాచోట్ల స్నానపు గదులకు తలుపులు లేవు. కిటికీలు ఊడిపోయాయి. వంట గదులతో పాటు భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మరమ్మతులు చేపడదామన్నా గత పాలకులు హామీలకే పరిమితమయ్యారు. నాడు - నేడు పథకంలో మరమ్మతులకు నిధులు మంజూరు చేసినా అవి కాగితాలకే పరిమితం అయ్యాయి. వసతి గృహాల దుస్థితి చూసి తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించేందుకు ముందుకు రాలేదు. కాగా కూటమి ప్రభుత్వ నిర్ణయంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పనులు పూర్తయితే వసతిగృహాల్లో విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

### త్వరలో పనులు చేపడతాం..

జిల్లాపరిధిలో 52 వసతి గృహాల్లో మరమ్మతులు త్వరితగతిన చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నాం. వంటశాలలు, మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లు శిథిలావస్థలో ఉన్న భవనాల పై దృష్టి సారించాం. పనులు త్వరితగతిన పూర్తి చేస్తాం. నాణ్యతా ప్రమాణాల మేరకు పనులు చేపడతాం. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం.

**జయప్రకాశ్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ సాధికారిత అధికారి**

## టిడ్కో లబ్ధిదారులను మోసగించిన వైసీపీ ప్రభుత్వం

### టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్

నూజివీడు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): టిడ్కో లబ్ధిదారులను గత వైసీపీ ప్రభుత్వం మోసంచేసి అప్పుల ఊబిలో నెట్టివేసిందని, ఆ అప్పులకు వడ్డీల చెల్లింపును కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ అన్నారు. నూజివీడు ఎమ్మార్ అప్పారావు కాలనీలోని టిడ్కో భవనాల సముదాయాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం కేవలం రాజకీయ కారణాలతోనే టిడ్కో భవనాల నిర్మాణంలో తీవ్ర నిర్లక్ష్యం చూపడంతో టిడ్కో కాంట్రాక్టర్ అయిన ఎల్‌అండ్‌టీ 2019లోనే భవన నిర్మాణాలను పూర్తిగా నిలిపివేసిందన్నారు. ఇది చాలదన్నట్లు 365, 430 చదరపు గజాల ఇళ్ల లబ్ధిదారుల పేరుతో 3.25 లక్షల రూపాయలను బ్యాంకర్ల నుంచి అప్పుగా తీసుకున్న ప్రభుత్వం ఆ నిధులను ఏం చేసిందో తెలియకుండా వ్యవహరించిందన్నారు. రుణ వాయిదాలకు సంబంధించి రూ.145 కోట్లను చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసిందన్నారు. 300 చదరపు అడుగుల నివేశ్న గృహాలకు సంబంధించి ఒక్క రూపాయి చెల్లిస్తే చాలు మీకు ఉచితంగా ఇళ్లు ఇస్తామని చెప్పిన వైసీపీ ప్రభుత్వం అందుకు సంబంధించి రూ.500 కోట్లను చెల్లించకుండా ఆ భారాన్ని కూటమి ప్రభుత్వం పైనే వేసింద న్నారు. ప్రస్తుతం రాష్ట్రప్రభుత్వం తొలుత 365, 430 చదరపు అడుగుల ఇళ్లను పూర్తిచేసి లబ్ధిదారులకు అందించాలనే లక్ష్యంతో అడుగులు వేస్తున్నామన్నారు. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బర్మాఫణిబాబు, నియోజకవర్గ జనసేన నాయకులు పాల్గొన్నారు.



టిడ్కో భవనాలను పరిశీలిస్తున్న టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్

## 'అసంఘటిత కార్మికులను ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయండి'

ఏలూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న ఐదు లక్షల మంది కార్మికులను ప్రతీ ఒక్కరినీ ఈ-శ్రమ్ పోర్టల్‌లో మార్చి 31వ తేదీ లోగా నమోదు చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం అసంఘటిత కార్మికులను ఈ- శ్రమ్‌లో నమోదు చేయడంపై అధికారులతో ఆమె సమీక్షించారు. అసంఘటిత రంగంలోని కార్మికులకు సామాజిక భద్రతతో పాటు సంక్షేమ పథకాలను అందించేందుకు ఈ కార్యక్రమం పక్కాగా చేయాలన్నారు. కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, జడ్పీ సీఈవో సుబ్బారావు, డీపీవో అనురాధ పాల్గొన్నారు.



## భక్తులతో కళకళలాడిన శ్రీవారి క్షేత్రం

ద్వారకాతిరుమల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయానికి ఉదయం నుంచే భక్తుల రాక ప్రారంభమైంది. ఏకాదశి మంచి తిథి కావడంతో దాదాపు 15 వేల మంది పైబడి భక్తులు వచ్చి ఉంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో ఆలయంలోని అన్ని విభాగాలు యాత్రికులతో నిండిపోయాయి. స్వామి ఉచిత దర్శనానికి దాదాపు రెండు గంటల పైబడి సమయం పట్టింది. స్వామిని దర్శించుకున్న భక్తులు అనంతరం అన్న ప్రసాదం స్వీకరించారు.


## దోమల పొగమంటే కాల్చేసింది

పిట్టలోళ్ల గుడిసెల దగ్ధం ఘటనకు కారణమిదే.. 9






టి.నరసాపురం మండలంలో విద్యార్థినికి బహుమతిని పంపిణీ చేస్తున్న దృశ్యం



లింగపాలెం మండలంలో సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న అధికారులు



ద్వారకాతిరుమల గురుకుల పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

# ఓటు హక్కు ఓ బ్రహ్మాస్త్రం

## ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం - పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో విస్తృతంగా అవగాహన

ఏలూరు అర్బన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి) : జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమాలు శనివారం నగరంలోని పలు విద్యా సంస్థల్లో జరిగాయి. సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో థెరిస్సా ఎలక్టోరల్ క్లబ్ సభ్యులను ఎన్నుకునే ప్రక్రియను ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ ఆధ్వర్యంలో నిర్వహించారు. సోషల్ సైన్సెస్ హెచ్‌వోడీ రత్నమేరి, అధ్యాపకులు చిట్టెమ్మ, అనూష, బాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. సీఆర్‌ఆర్ కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన సదస్సులో ప్రిన్సిపాల్ రామరాజు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును నిజాయితీగా వినియోగించుకోవాలని అన్నారు.

**లింగపాలెం :** ఓటు హక్కును నిజాయితీగా వినియోగించుకుంటూ సమర్థులైన నాయకులను ఎన్నుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.ముక్కంటి అన్నారు. మండల కేంద్రమైన లింగపాలెంలో 15వ జాతీయ ఓటర్ల దినోత్సవంలో భాగంగా సీనియర్ సిటిజన్స్‌ను, నూతనంగా ఓటు హక్కును పొందిన ఓటర్లను సన్మానించారు. అనంతరం ఓటు హక్కు వినియోగంపై అవగాహనా ర్యాలీ నిర్వహించి విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. వ్యాస రచన, ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులు, రెవెన్యూ, ఐసీడీఎస్, వెలుగు మహిళా సిబ్బందికి బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నజీముల్లాషా, ఎంపీడీవో కందుల వాణి, కంఠా రామారావు, బొంతు రాంబాబు, బొంతు శ్రీనివాసరావు, ఎం.మల్లికార్జునరావు పాల్గొన్నారు.

**దెందులూరు :** ఓటు హక్కు సామాన్యుల చేతిలో బ్రహ్మాస్త్రమని జిల్లా అదనపు డిప్యూటీ కలెక్టర్, దెందులూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి కె.భాస్కర్ అన్నారు. శనివారం ఏపీ యాదవ్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పెనుబోయిన మహేష్ యాదవ్, దెందులూరు తహసీల్దార్ బత్తుల సుమతి ఆధ్వర్యంలో దెందులూరు గారపాటి హైమావతి ఉన్నత పాఠశాలలో ఓటర్ల దినోత్సవంపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇంచార్జీ గారపాటి కొండయ్య చౌదరి, ఇప్పిలి వెంకటేశ్వర రావు, తోట యేసమ్మ పాల్గొన్నారు. కొవ్వలి జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం శర్మ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ఓటరు దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. దోసపాడులో ప్రభుత్వ పాఠశాల ఎంఈవో అన్నమ్మ హెచ్‌ఎం ఎస్.రాణి ఆధ్వర్యంలో ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేయించారు.

**ద్వారకా తిరుమల :** ఓటు హక్కు వినియోగంపై విద్యార్థి దశనుంచే అవగాహన పెంచుకోవాలని మహిళా పోలీస్ పి.లక్ష్మీసుజన సూచించారు. ద్వారకా తిరుమల బాలికల గురుకుల పాఠశాల, ఎంపీయూపీ స్కూల్స్‌లో ఆమె విద్యార్థులకు ఓటు హక్కు ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో బూత్‌లెవెల్ ఆఫీసర్లు పురుషోత్తం, జ్యోతి, భవాని పాల్గొన్నారు.

**కామవరపు కోట :** కామవరపుకోట మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల వద్ద శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. తహసీల్దార్ గెడ్డం ఎలీషా, ఎంపీడీవో సరళ కుమారి, పాఠశాల హెచ్‌ఎం సర్వేశ్వర రావు, వీఆర్వోలు ఎస్.కె.మెహబూబ్ సాహెబ్, రమేష్, మాదు లక్ష్మీనారాయణలతో పాటు వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**ఏలూరు :** యువతీ, యువకులు తప్పనిసరిగా ఓటు హక్కును నమోదు చేయించుకోవాలని జంగారెడ్డి గూడెం ఆర్డీవో ఎం.వి.రమణ సూచించారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని స్థానిక వెంకటేశ్వర ఎడ్యుకేషన్ సొసైటీ భవనంలో తహసీల్దారు కె.స్లీవజోజి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు.

**చింతలపూడి:** స్థానిక ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముక్కంటి ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కూడా ఎన్‌సిసి క్యాడెట్ ఆధ్వర్యంలో ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్నికల సహాయ అధికారిణి డి.భ్రమద్వర, డిటి షకీలున్నీసా, ఎంఈవో కిరణ్‌బాబు, పలువురు పాల్గొన్నారు.

**పెదపాడు :** పెదపాడు హైస్కూల్ వద్ద విద్యార్థుల ర్యాలీని తహసీల్దారు కృష్ణజ్యోతి ప్రారంభించి పాలకేంద్రం, పెదపాడు బస్టాండ్ మీదుగా ఎంపీడీవో కార్యాలయం వరకూ ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ, ఎంపీడీవో కార్యాలయం వద్ద మానవహారం నిర్వహించారు. అనంతరం సీనియర్ ఓటర్లు, కొత్త ఓటర్లను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అమీలు జమ, సూపరింటెండెంట్ రవికుమార్, వీఆర్వో నరసింహ పాల్గొన్నారు.

**పెదవేగి :** జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని తహసీల్దారు ఎస్వీ భ్రమరాంబ ఆధ్వర్యంలో ఓటుహక్కు వినియోగంపై శనివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పెదవేగి ఆర్ఐ కేవీవీ.సారథి, టీడీపీ నాయకుడు తాతా సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**వేలేరుపాడు :** మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్లో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమలో డీఈఓ రామ్మోహన రావు, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ శ్రీహరి, రేపాక గొమ్ము గ్రామ సర్పంచ్ చోడే వెంకమ్మ పాల్గొన్నారు.

**బుట్టాయగూడెం :**మండల కేంద్రంలో తహసీల్దార్ పీవి చలపతిరావు ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువకులు తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

**జీలుగుమిల్లి :** జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జీలుగుమిల్లిలో ప్రధాన సెంటరు ఇన్‌చార్జీ తహసీల్దారు ఉదయ్ భాస్కర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. మానవహారం ఏర్పాటు చేసి ఓటును వినియోగించుకుంటామంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటలక్ష్మి, ఎంఈవో శ్రీనివాస్, రెవెన్యు సిబ్బంది ఉన్నారు.

**టి.నరసాపురం :** ఓటు వేసే వ్యక్తి ప్రజాస్వామ్యానికి శక్తి అని తహసీల్దార్ టి.సాయిబాబా తెలిపారు.15వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీగా వెళ్ళి మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం జడ్పీ ఉన్నత పాఠశాలలో సీనియర్ ఓటర్లను సన్మానించారు.

## దీపికకు వక్తృత్వ పోటీ బహుమతి

ఏలూరు అర్బన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి) : జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా విద్యాశాఖ నిర్వహించిన వక్తృత్వ పోటీలో స్థానిక శ్రీ శర్వాణీ స్కూలు విద్యార్థిని జి.నాగశ్రీ దీపిక ద్వితీయ బహుమతి సాధించింది. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో దీపికకు కలెక్టర్ వెట్రిసెల్వి జ్ఞాపికను బహూకరించారు. డీఈవో వెంకటలక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## నేడు షిర్డీ సాయి బాబా మందిరం వార్షికోత్సవం

ఏలూరు కార్పొరేషన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి) : స్థానిక రామచంద్రరావు పేటలోని శంకర మఠం సమీపంలోని శ్రీషిరిడీ సాయిబాబా మందిరం వద్ద 33వ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్టు ఆలయ అర్చకులు బాబి తెలిపారు. ఈ సందర్భంగా భక్తులతో సామూహికంగా శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతాలు జరిపిస్తామన్నారు. వార్షికోత్సవం సందర్భంగా సోమవారం భక్తులకు ఆలయ ప్రాంగణంలో మహా అన్న సమారాధనను నిర్వహిస్తామని చెప్పారు.

## తాండ్ర పాపారాయుడి వర్ధంతి

ఏలూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి) : తాండ్ర పాపారాయుడు 267వ వర్ధంతిని పట్టణ వెలమ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బి.జోగిబాబు,పైల చంటి ఆధ్వర్యంలో శనివారం నివాళులర్పించారు. ఈసందర్భంగా సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు రాజాన సత్యనారాయణ పాల్గొని తాండ్రపాపారాయుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు సి.హెచ్.అచ్యుతరామయ్య ఆర్.నాగేశ్వరరావు, ఆర్.పుల్లయ్య, జి.నూకరాజు, ఎల్‌వీఆర్ పాల్గొన్నారు.

## పంపిణీకి టీసీసీ పాస్ సర్టిఫికెట్లు సిద్ధం

ఏలూరు అర్బన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి) : గతేడాది ఏప్రిల్‌లో జరిగిన టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు(టీసీసీ) డ్రాయింగ్, టైలరింగ్ లోయర్, హయ్యర్ పరీక్షల ఉత్తీర్ణులకు ఒరిజినల్ పాస్ సర్టిఫికెట్లు డీఈవో కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని ఏలూరు జిల్లా డీఈవో వెంకటలక్ష్మమ్మ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు హాల్ టిక్కెట్ జిరాక్స్, స్వీయ అభ్యర్థనతో స్వయంగా ఏలూరు డీఈవో కార్యాలయంలో అందజేసి పాస్ సర్టిఫికెట్లను పొందాలని కోరారు.

## జనన, మరణాల నమోదుపై అవగాహన

పోలవరం, జనవరి 25(ఆంధ్రజ్యోతి) : జనన మరణాల నమోదుపై పోలవరం మండల కార్యాలయంలో మండల ప్రజా పరిషత్ అధికారి ఇ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రజా పరిషత్ అధికారి మాట్లాడుతూ జనన, మరణాలు సంభవిస్తే 21రోజుల లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వింజరం వైద్యాధికారి నిఖిల్, వింజరం వైద్యాధికారి మురళీధర్ పాల్గొన్నారు.

## రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, జనవరి 25(ఆంధ్రజ్యోతి) : రైలు పట్టాలపై గుర్తు తెలియని మృత దేహం ఉన్నట్లు ఏలూరు రైల్వే పోలీసుకు సమాచారం అందింది. దీంతో రైల్వే హెడ్ కానిస్టేబుల్ జె సుధాకర్ తన సిబ్బందితో శనివారం సంఘటన స్థలానికి వెళ్ళి పరిశీలించారు. దెందులూరు రైల్వే గేటు సమీపంలో రైలుపట్టాలపై మృత దేహాన్ని పరిశీలించగా మృతుడు అస్సాం రాష్ట్రం పరబత్ పూర్‌కు చెందిన దీపంకర్ సోనోవీల్(36)గా గుర్తించారు. రైలు బండి నుంచి ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందినట్లుగా గుర్తించారు.

## పోడు భూములకు పట్టాలు మంజూరు చేయండి : సీపీఐ

బుట్టాయగూడెం, జనవరి 25(ఆంధ్రజ్యోతి) : గిరిజనులు సాగుచేస్తున్న పోడుభూములకు పట్టాలు మంజూరు చేయాలని, గిరిజనుల అభివృద్ధికి సహకారం అందించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు అక్కినేని వనజ, డేగా ప్రభాకర్ డిమాండ్ చేశారు. పేదలకు ఇళ్ళ స్థలాలు మంజూరు చేయాలని, పోడు భూములకు పట్టాలివ్వాలని, పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ శనివారం సీపీఐ మండల కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, బి.వెంకటేశ్వర రావు, ఎయికె చంద్రం, చోడెం దుర్గ, బేతి కిషోర్, జెవి రమణరాజు, జి.బాల యేసు, ఎం.క్రాంతి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## పునరావాస పరిహారంలో అందరికీ న్యాయం జరగాలి

కుక్కునూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మండలం మొత్తం యూనిట్‌గా తీసుకుని పునరావాస పరిహారం చెల్లించాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఏ.రవి డిమాండ్ చేశారు. శనివారం కుక్కునూరులో జరిగిన మండల కమిటీ సమావేశంలో మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులకు కట్‌ఆఫ్ తేదీతో సంబంధం లేకుండా పునరావాస పరిహారం చెల్లించాలన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండా ప్రభుత్వం నిర్వాసితులను మోసం చేసిందన్నారు. జనవరి 30వ తేదీన రాష్ట్ర మహాసభలు జయప్రదం కోరుతూ పోలవరం నుంచి నెల్లూరు వరకుసాగే జీపు జాతాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి బుయ్యన శ్రీను, వై.నాగేంద్ర రావు, లక్ష్మయ్య, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్ వాడీల్లో ప్లేట్లు పంపిణీ

బుట్టాయగూడెం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కోర్సవారిగూడెం పంచాయతీ పరిధిలోని 8 అంగన్‌వాడీ కేంద్రాల్లోని 60మంది పిల్లలకు ఆత్మ బంధువులం సేవా సంస్థ ప్రతినిధులు ప్లేట్లు, గ్లాసులు, పలకలు, దుప్పట్లు, పెన్నులను శనివారం పంపిణీ చేశారు.

## పోతునూరులో దివ్య బలిపూజ

దెందులూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తోటి వారికి తమ వంతు సహకారం అందించాలని ఏలూరు ఆర్‌సీఎం పీఠం విచారణ గురువు (బిషప్) పోలిమేర జయరావు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని పోతునూరు గ్రామంలోని నిత్యసహాయ మాత దేవాలయ 10వ వార్షికోత్సవంలో భాగంగా దివ్యబలిపూజ నిర్వహించారు. స్థానిక విచారణ గురువు పాదర్ తంబి రుంజల ఆధ్వర్యంలో ఈ వేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాదర్ అమ్మన్ రాజాతో పాటు పలువురు పాదర్లు పోతునూరు సంఘ పెద్దలు పాల్గొన్నారు.

## సీఆర్‌ఆర్ వ్యవస్థాపక ప్రిన్సిపాల్ విగ్రహావిష్కరణ

ఏలూరు అర్బన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి) : స్థానిక సర్ సీఆర్ రెడ్డి కళాశాల వ్యవస్థాపక ప్రిన్సిపాల్ దేశరాజు సత్యసుబ్రహ్మణ్యం కాంస్య విగ్రహాన్ని శనివారం సీఆర్‌ఆర్ విద్యా సంస్థల పాలకవర్గ అధ్యక్షుడు డాక్టర్ అల్లూరి ఇంద్ర కుమార్ ఆవిష్కరించారు. కళాశాల తొలిప్రిన్సిపాల్‌గా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, పాలకవర్గ ఉపాధ్యక్షులు డాక్టర్ వి.వి.బాలకృష్ణారావు, ఏ.వి.సుబ్రహ్మణ్యం, కార్యదర్శి డాక్టర్ మాగంటి ప్రసాద్, సంయుక్త కార్యదర్శులు కొడాలి వెంకటసుబ్బారావు, వల్లభనేని శ్రీకృష్ణ, కోశాధికారి చిట్టూరి జానకిరామయ్య, తదితరులు మాట్లాడారు.

## కెనరా బ్యాంకు పథకాలపై అవగాహన

ఏలూరు అర్బన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : సూక్ష్మ, చిన్నతరహా, మధ్యతరహా వ్యాపార(ఎంఎస్‌ఎంఈ) రుణాల జారీకి సులభతరమైన విధానాలను అందుబాటులోకి తెచ్చినట్టు కెనరా బ్యాంకు విజయవాడ సర్కిల్ కార్యాలయ డిప్యూటీ జనరల్ మేనేజర్ అనంత పద్మనాభరావు ప్రకటించారు. శనివారం స్థానిక కళ్యాణి హైట్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు ఎంఎస్‌ఎంఈ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, వ్యాపారులకు రుణపత్రాలను అందజేసి, బ్యాంకు పథకాలపై అవగాహన కల్పించారు. చిన్న, మధ్యతరహా వ్యాపార వర్గాల కోసం తక్కువ వడ్డీపై అందిస్తున్న రుణాలు, ప్రభుత్వ రాయితీలను వినియోగించుకోవాలని కోరారు. బ్యాంకు భీమవరం ప్రాంతీయ కార్యాలయం ఏజీఎం తోట రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహా అన్నప్రసాద వితరణ

ఏలూరు కార్పొరేషన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి) : స్థానిక రామచంద్రరావు పేటలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో మహా అన్నప్రసాద వితరణ ఘనంగా జరిగింది. గత నెల 28వ తేదీ నుంచి ఈ నెల 18వ తేదీ వరకు శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని అన్నప్రసాద వితరణను కూటమి నాయకులు, నగర పాలక సంస్థ కో-ఆప్షన్ మెంబర్ ఎస్‌ఎంఆర్ పెదబాబు ప్రారంభించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీష్ కుమార్, కూటమి నాయకులు పాలడుగు రమాదేవి ప్రసాద్, నల్ల కాశీ, ఈతకోట శ్రీను, దేవరకొండ శ్రీనివాసరావు, సబ్బిన శ్రీనివాసరావు, ఈదుపల్లి పవన్, పాము శామ్యూల్ ఏర్పాట్లు చేశారు.

## మాదేపల్లి ఇందిరా కాలనీలో మహిళల ఆందోళన

ఏలూరు రూరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి) : సెల్ టవర్‌ను జనావాసాల మధ్య ఎలా ఏర్పాటు చేస్తారంటూ మాదేపల్లి ఇందిరా కాలనీలో మహిళలు శనివారం ఆందోళనకు దిగారు.గతంలో ఇదే సెల్ టవర్ నిర్మాణానికి వ్యతిరేకంగా ఆందోళన చేయడంతో అధికారులు నిలిపివేశారు. తిరిగి మళ్లీ టవర్ నిర్మాణానికి ప్రయత్నిస్తుండగా ఇందిరా కాలనీ మహిళలు మరోసారి అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మున్సిపల్ టీచర్స్ కోఆపరేటివ్ సొసైటీపై చర్యలేవి?

ఏలూరు అర్బన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి) : ఏలూరు మున్సిపల్ ఎలిమెంటరీ అండ్ అప్పర్ ప్రైమరీ టీచర్స్ కో-ఆపరేటివ్ సొసైటీపై గతేడాది సహకార శాఖ డీఎల్‌పీవోకు అందజేసిన ఫిర్యాదుపై ఏం చర్యలు తీసుకున్నారని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అధికారులు జరిపిన విచారణలో తమ అభియోగాలు నిజమేనని నిగ్గుతేలినందున సంబంధిత డిపాల్టర్లపై ఇంత వరకు ఎందుకు చట్టపరమైన చర్యలు చేపట్ట లేదని గోపిమూర్తి ప్రశ్నించారు. ఈ మేరకు స్పందించిన డీసీవో ఇప్పటికే పీపీసీని ఏర్పాటు చేశామని, త్వరలోనే ప్రత్యేకాధికారి బాధ్యతలు తీసుకుంటారని,విచారణ నివేదిక మేరకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని యూటీఎఫ్ నాయకులు వివరించారు.

## మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజుకు మాతృవియోగం

పోలవరం/బుట్టాయగూడెం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజుకు మాతృవియోగం కలిగింది. శనివారం సాయంత్రం బుట్టాయగూడెం మండలం దుద్దుకూరులో ఆయన నివాసం వద్ద మాజీ ఎమ్మెల్యే బాలరాజు మాతృమూర్తి తెల్లం మల్లమ్మ(80) అనారోగ్యంతో మృతి చెందారు. గత కొంత కాలంగా అనా రోగ్యంతో బాధపడుతున్న ఆమె నివాసం వద్దే కన్నుమూశారు. ఈ మేరకు పలువురు నాయకులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

## హెల్మెట్, సీటుబెల్టు ధరించాలంటూ అవగాహన

ఏలూరు క్రైం, జనవరి 25(ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం కలపర్రు జాతీయ రహదారిపై రవాణా శాఖ తనిఖీ అధికారులు వాహనదారులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెల్మెట్‌ను ధరించి ద్విచక్ర వాహనాలను నడిపే వారికి, సీటు బెల్టును ధరించి కారును నడిపే వాహన చోదకులకు రవాణా శాఖ తనిఖీ అధికారులు గులాబీ పువ్వులను అందించి ప్రశంసలు తెలియజేశారు. అదే సమయంలో హెల్మెట్, సీటు బెల్టు ధరించకుండా వాహనాలను నడిపే చోదకులను ఆపి వారికి ప్రమాదాలపై అవగాహన కల్పించారు. వాహనదారులకు రహదారి భద్రతా నియమాలను కరపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో వాహన తనిఖీ అధికారులు జి.స్వామి, వై.ఎస్.వి.కల్యాణి, పి.నరేంద్ర బాబు, తదితరులు పాల్గొన్నారు.

## ఏలూరు డంపింగ్ యార్డులో చెత్తను తొలగిస్తాం : పట్టాభిరాం



సమావేశంలో మాట్లాడుతున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్

ఏలూరు టూటౌన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా 85 లక్షల టన్నుల చెత్త వైసీపీ ప్రభుత్వం వదిలి వెళ్ళిందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి రామ్ మండిపడ్డారు. ఏలూరులోని 60వేల టన్నుల చెత్తను పోగు చేసి వెళ్లిపోయారని అన్నారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, కమిషనర్ భాను ప్రతాప్‌లతో ఆయన శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డంపింగ్ యార్డులో ఉన్న చెత్తను తొలగించి 30ఎకరాల భూమిని ప్రజాప్రయోజనాల కోసం వినియోగిస్తామన్నారు. నగరంలో సేకరించే తడిచెత్తను ప్రాసెస్ చేసి వర్మీ కంపోస్టుగా మారుస్తామన్నారు. పొడిచెత్తలో వచ్చిన ప్లాస్టిక్‌ను, పేపర్లను ప్రైవేటు ఏజెన్సీలకు అందజేస్తామన్నారు. స్వచ్ఛత విషయంలో పోటీపడే కార్పొరేషన్లకు అదనపు నిధులు మంజూరు చేస్తామన్నారు. త్వరలో విజయవాడలో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయనున్నామని దీని ద్వారా రాష్ట్రమంతా మానిటరింగ్ చేస్తామన్నారు. గతంలో మాదిరిగా కాకుండా మోడర్ టాయిలెట్‌లను అందుబాటులోకి తెస్తామన్నారు.

## మానవ అక్రమ రవాణాను సమష్టిగా అరికట్టాలి

ఏలూరు క్రైం, జనవరి 25(ఆంధ్రజ్యోతి) : మానవ అక్రమ రవాణా అరికట్టడానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ అన్నారు. ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలోని డీఎల్‌ఎస్‌ఏ భవనంలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ అధికారులతో అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం సుబ్బారావు, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ శారద, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సూర్యచక్రవేణి, డీసీఆర్బీ ఎస్ఐ రాజా రెడ్డి, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పిఎస్‌వి మునేశ్వరరావు పలువురు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీయాలి

పెదపాడు, జనవరి 25(ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో దాగి ఉన్న శాస్త్ర సాంకేతిక విజ్ఞాన, గణిత శాస్త్ర నైపుణ్యాలను వెలికితీసి వారి ప్రతిభకు పదునుపెట్టేందుకు సైన్స్ ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని ఎంఈవో-2 డి.వి.రమణ అన్నారు. పెదపాడు సెయింట్ ఆగస్టీన్ పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను శనివారం నిర్వహించారు. పలువురు విద్యార్థులు వివిధ అంశాలతో కూడిన సైన్స్ ప్రదర్శన నమూనాలను ప్రదర్శించి, వాటి పనితీరు, ఉపయోగాలను తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిస్టర్ జేసింత, సిబ్బంది పాల్గొన్నారు.

## కొయ్యలగూడెం తహసీల్దార్‌కు ఉత్తమ ఎలక్టోరల్ అవార్డు

కొయ్యలగూడెం, జనవరి 25(ఆంధ్రజ్యోతి) : 2024 ఎన్నికల్లో అసిస్టెంట్ ఎలక్టోరల్ మేనేజ్మెంట్ అధికారిగా సేవలందించినందుకు కొయ్యలగూడెం తహసీల్దార్ చెల్లన్న దొరకు ఉత్తమ అవార్డు దక్కింది. ఈ మేరకు శనివారం రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ కే.విద్యానంద్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎంతో బాధ్యతగా విధులు నిర్వహించానని ప్రభుత్వం గుర్తించి తనకు అవార్డు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## నేటి నుంచి దర్గా మహోత్సవాలు

ఏలూరు రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఏలూరు నగరంలో ప్రసిద్ధిచెందిన కోటదిబ్బపై ఉన్న హజరత్ సయ్యద్ బాయాజిద్ మహాత్ముల దర్గాలో ఈ నెల 26నుంచి 27వరకు ఉరుసు మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు దర్గా ముజావర్లు తెలిపారు.

## లారీ యాజమానులకు బకాయిలు చెల్లించండి

ఏలూరు టూటౌన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి) : లారీ యాజమానులకు ప్రభుత్వం తక్షణమే బకాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ధాత్రీరెడ్డికి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సూచించారు. ఎంపీ క్యాంపు కార్యాలయంలో శ్రీఆంజనేయ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చింతలపూడికి చెందిన లారీ ఓనర్లు ఎంపీ మహేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.సార్వాకు సంబంధించి ధాన్యాన్ని తరలించిన లారీ ఓనర్లకు బకాయిలు చెల్లించాలని ఎంపీ మహేష్ కుమార్ జేసీకి సూచించారు.

## నిప్పంటుకుని వృద్ధుడికి గాయాలు

ఏలూరు క్రైం, జనవరి 25(ఆంధ్రజ్యోతి) : దెందులూరు మండలం పోతునూరు గ్రామంలో ఘోర సంఘటన చోటు చేసుకుంది. దోమల చక్రం వెలిగించి పెట్టుకోగా దుప్పటకు అంటుకుని పక్షవాతంతో బాధపడుతున్న వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. మంటలను గమనించి భార్య పద్మ వెంటనే తన భర్త లాజర్‌ను కాపాడే ప్రయత్నం చేసింది. ఇరుగుపొరుగు వారు మంటలు ఆర్పి అతనిని ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

## రిజర్వ్ ఫారెస్ట్‌లో తవ్వకాలు చేపట్టిన యంత్రాల స్వాధీనం

వేలేరుపాడు(కుక్కునూరు), జనవరి 25(ఆంధ్రజ్యోతి): కుక్కునూరు అటవీరేంజ్ పరిధిలోని వేలేరుపాడు మండలం కటుకూరు రిజర్వ్ ఫారెస్ట్‌లో అక్రమంగా తవ్వకాలు చేపట్టిన యంత్రాలను అటవీ శాఖ సిబ్బంది అడ్డుకున్నారు. శుక్రవారం రాత్రి గ్రావెల్ తవ్వుతున్నారనే సమాచారం రావడంతో కుక్కునూరు అటవీరేంజ్ అధికారిణి కృష్ణకుమారి, వీఆర్వో కేసరి, సిబ్బందితో వెళ్లి ఎక్సవేటర్‌ను, ఐదు ట్రాక్టర్లను పట్టుకున్నారు. అనంతరం కుక్కునూర అటవీరేంజ్ కార్యాలయానికి తరలించారు.

## రైతుల హర్షం

బుట్టాయగూడెం, జనవరి 25(ఆంధ్రజ్యోతి) : రైతులు కోరినట్టుగా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్, ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు ఆదేశాల మేరకు శనివారం బుట్టాయగూడెం సబ్‌స్టేషన్‌లో రైతుల సౌకర్యార్థం పిటిఆర్ 8 ఎంవిఆర్ ట్రాన్స్ ఫార్మర్‌ను విద్యుత్ అధికారులు స్పందించి ఏర్పాటు చేయడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు. అడిగిన వెంటనే స్పందించిన ఎంపి, చైర్మన్‌లకు రైతులు యంట్రప్రగడ శ్రీనివాసరావు, గద్దె అబ్బులు, కుందుల శ్రీను, మడకం రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

## సంపూర్ణ పారిశుధ్యం చేపట్టండి



డంపింగ్ యార్డ్‌ను పరిశీలిస్తున్న నాగనర్సింహారావు

చింతలపూడి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): చింతలపూడి ఏరియాలో పారిశుధ్యంపై దృష్టిపెట్టాలని రాజమండ్రి రీజనల్ డైరెక్టర్ అడ్మినిస్ట్రేషన్ అధికారి నాగనరశింహారావు అధికారులకు సూచించారు. శనివారం ఆయన మొదటి సారిగా మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం ఫైర్ స్టేషన్ సెంటర్ సమీపంలోని డంపింగ్ యార్డ్‌ను పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ డి.పావని తడి, పొడి చెత్త డంపింగ్ యార్డ్ పనులను వివరించారు. అక్కడ ఆయన కొన్ని సూచనలు ఇచ్చారు. పట్టణంలో పారిశుధ్యం మెరుగుపడేలా కృషి చేయాలని అన్నారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## ఫిబ్రవరిలో స్నేహాంజలి క్రికెట్ టోర్నమెంట్

ఏలూరు రూరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి) : గత 12 ఏళ్ళుగా మిత్రుల జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న స్నేహాంజలి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఫిబ్రవరిలో నిర్వహిస్తున్నట్టు స్నేహాంజలి ఫ్రెండ్స్ ఉల్లింగల సురేష్ స్నేహితులు తెలిపారు. శనివారం టోర్న మెంట్‌కు సంబంధించి లోగోను ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జంపా సూర్యనారాయణ, డి.రంగా, మాజీ కౌన్సిలర్ ఎస్.చిరంజీవి, ఏ.శ్రీనివాస్, కరణం రాజు, ఆర్నేపల్లి తిరుపతి, ఎం.బాలాజి పాల్గొన్నారు.

## కోటి 60 లక్షలతో లోవోల్టేజ్‌కి పరిష్కారం

చింతలపూడి, జనవరి 25(ఆంధ్రజ్యోతి) : చింతలపూడి నియోజకవర్గంలో లోవోల్టేజ్ సమస్య పరిష్కారం కోసం కోటి 60 లక్షల రూపాయలతో 21 ట్రాన్స్‌ఫార్మర్లు, రెండు బ్రాకర్లు, 121 స్తంభాలు, ఎనిమిది కిలోమీటర్ల కండక్టర్ వైరు మంజూరయ్యాయని ట్రాన్స్‌కో డీఈ పి.అహ్మద్ ఖాన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించినట్టు ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

## కలెక్టర్ చేతుల మీదుగా కీర్తనకు బహుమతి

ఏలూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం జడ్పీ బాయ్స్ హైస్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న కూనిశెట్టి కీర్తన వ్యాసరచన పోటీల్లో జిల్లా స్థాయిలో తృతీయ స్థానం సాధించ డంతో కలెక్టర్ వెట్రిసెల్వి చేతుల మీదుగా బహుమతి అందుకో వడం అభినందనీయమని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఎం.విజయ ప్రకాష్ పేర్కొన్నారు.శనివారం ఏలూరులో బహుమతి అందుకున్న సందర్భంగా కీర్తనను పాఠశాల సిబ్బంది అభినందించారు.

## బంధువుల చెంతకు తప్పిపోయిన వ్యక్తి..

పెదవేగి, జనవరి 25(ఆంధ్రజ్యోతి) : రహదారి పక్కన రెండ్రోజులుగా అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ రమేష్ వివరాలు తెలుసుకుని బంధువులకు అప్పగించారు. చింతలపూడి మండలం పోతునూరు గ్రామానికి చెందిన కొమ్ము వెంకటేష్‌గా గుర్తించారు. కొమ్ము వెంకటేష్‌కు మతిస్థిమితం లేకపోవడంతో కొద్దిరోజుల కిందట ఏలూరు సర్వజన ఆస్పత్రిలో చేర్పించగా అక్కడి నుంచి పారిపోయాడు. ఎట్టకేలకు బంధువుల వద్దకు చేరడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## బాధితుల సొమ్ము రికవరీకి చర్యలు

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

జీలుగుమిల్లి, జనవరి 25: (ఆంధ్రజ్యోతి) : డ్వాక్రా రుణాల స్వాహా అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో శనివారం వచ్చిన కథనానికి వెలుగు అధికారులు స్పందించారు. దిబ్బగూడెం సీఏ టి.పవిత్ర నుంచి ముగ్గురి ఉన్నతి రుణాలు 30వ తేదీన కట్టాలని, మిగిలిన సొమ్ము ఫిబ్రవరి 15 తేదీకల్లా రికవరీ చెయ్యాలని ఆదేశించినట్లు ఏపీఎం జాన్సీ చెప్పారు. డ్వాక్రా బాధిత డ్వాక్రా మహిళలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

## 'కక్షిదారులకు న్యాయ సహాయం అందించాలి'

ఏలూరు క్రైం, జనవరి 25(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌ఛార్జి, ఎనిమిదవ అదనపు జిల్లా జడ్జి ఎం.సునీల్ కుమార్ ఆధ్వర్యంలో పారా లీగల్ వలంటీర్ల నియామకానికి చర్యలు చేపట్టారు.ఈ మేరకు హాజరైన అభ్యర్థులతో మాట్లాడుతూ బాధితులకు, న్యాయస్థానాలకు వారధిగా పనిచేయాలని, కక్షిదారులకు అవసరమైన న్యాయ సహాయాన్ని అందించడంలో కీలకపాత్ర వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్, షేక్ మహ్మద్ అబూతాలిబ్ పర్వీజ్ పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికే మండల పరిషత్ నిధులు

కొయ్యలగూడెం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గ్రామాలభివృద్ధికి మండల పరిషత్ నిధులు మంజూరు చేస్తున్నట్టు ఎంపీపీ గంజిమాల రామారావు పేర్కొన్నారు.శనివారం మండల పరిషత్ కార్యాలయం సమావేశం హాల్లో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ నిధులన్నీ ఎంపీటీసీల ఆమోదం మేరకే మంజూరవుతాయని, ఆ నిధులు గ్రామాల అభివృద్ధికి కేటాయించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దాసరి శ్రీలక్ష్మి, ఎంపీడీఓ కిరణ్ పాల్గొన్నారు.

## గ్రామీణ వైద్యుల పరిమితులపై దిశానిర్దేశం

కుక్కునూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి) : గ్రామీణ వైద్యులు తమ పరిమితికి మించి రోగులకు వైద్యం చేయవద్దని కె.ఆర్.పురం డిప్యూటీ డీఎంహెచ్‌వో సురేష్ సూచించారు. కుక్కునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో శనివారం గ్రామీణ వైద్యులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. వైద్యం అందించే ప్రతి గ్రామీణ వైద్యులకు అర్హత సర్టిఫికెట్లు ఉండాలన్నారు.

## పాడిరైతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి

పెదపాడు, జనవరి 25(ఆంధ్రజ్యోతి) : పాడి రైతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని పెదపాడు డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ బొప్పిడి కాశీబాబు తెలిపారు. పెదపాడు పశు వైద్యశాలలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని శనివారం ప్రారంభించారు. పశువులకు నట్టల నివారణ గర్భకోశ వ్యాధులకు సంబంధించి పశువైద్యాధికారిణి వాణిసంధ్యశ్రీ పరీక్షలు నిర్వహించి, పాడి రైతులకు విలువైన మందులను ఉచితంగా అందజేశారు.

సెలబ్రిటీ


సంక్రాంతికి వస్తున్నాం వర్కింగ్ స్టిల్

# సంక్రాంతి స్టార్ బుల్లి రాజు

**ఒక్క ఛాన్స్.. ఒకే ఒక్క ఛాన్స్ నేనేంటో చూపిస్తా.. అంటూ సినీ పరిశ్రమలో అడుగుపెట్టి మొదటి సినిమాతోనే అంతా తన వైపు చూసేలా చేసుకొన్న చిచ్చర పిడుగు బుల్లిరాజు మన గోదారి కుర్రోడే. కొల్లేరుతీర ప్రాంతం ఛానమిల్లి నుంచి తన రీల్స్‌తో అందరినీ ఆకట్టుకొన్న బుల్లిరాజు సినిమా ఛాన్స్ కొట్టేశాడు. గోదావరి యాస, ప్రాసతో అందరిని ఆకట్టుకున్నాడు. సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో బుల్లిరాజు నటనకు ప్రేక్షకులతో పాటు సినీ హీరోలు సైతం ఫిదా అయిపోయారు. వెంకటేష్, మహేష్‌బాబు, నాగార్జున, చిరంజీవి వంటి స్టార్ హీరోలతో పాటు సినీ పెద్దలతో శభాష్ అనిపించుకొన్న బుల్లిరాజుతో కాసేపు ముచ్చటిద్దాం..**



**❖ మొదటి చిత్రంతోనే స్టార్ అయ్యావ్.. ఎలా ఫీల్ అవుతున్నావ్..?**

చాలా సంతోషంగా ఉంది. సినిమా చూసిన వారంతా నా పాత్రను బాగా ఆనందించారు. నన్ను బాగా రిసీవ్ చేసుకుంటున్నారు.

**❖ బుల్లిరాజుగా ఫేమస్ అయ్యావ్.. అసలు పేరు ఏమిటి ?**

సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో బుల్లిరాజుగా గుర్తింపు పొందడం అనిల్ సార్ వల్లే జరిగింది. రేవంత్‌ను బుల్లిరాజుగా పరిచయం చేసిన ఘనత ఆయనదే. నా పూర్తి పేరు భీమాల రేవంత్ పవన్ సాయి సుభాష్. మా నాన్న భీమాల శ్రీనివాసరావు, అమ్మ దేవి, మా తాతయ్య సుబ్బారావు, నాగమణి నన్ను ఎంతో గారాబంగా చూసుకుంటారు.

**❖ సినిమాలో ఛాన్స్ ఎలా వచ్చింది?**

నాకు పవన్‌కల్యాణ్ అంటే చాలా ఇష్టం. మొన్న ఎన్నికల్లో జనసేన తరుపున ఇంటింటీ వెళ్లి ప్రచారం కూడా చేశారు. మా నాన్న స్నేహితుడు గోలి సాయి ప్రచారాన్ని రీల్‌గా చేసి ఇన్‌స్టాగ్రాంలో పోస్ట్ చేశారు. రెండు గంటల్లో 4లక్షల మంది చూడడంతో పాపులర్ అయ్యింది. దర్శకుడు అనిల్ సార్ క్లోజ్ ఫ్రెండ్ గుడివాడకు చెందిన సాయికృష్ణ అంకుల్ ఆ రీల్ చూసి అనిల్ సార్‌కు చెప్పారు. నన్ను ఆడిషన్స్‌కు పిలిచారు. మొత్తం 20 మందిని పిలవగా నేను ఎంపికయ్యాను.


అమ్మా నాన్నతో బుల్లిరాజు

**❖ సినిమాలో నటనపై అమ్మా నాన్న ఏమంటున్నారు?**

నేను సినిమాలో నటించడానికి అమ్మా నాన్న ప్రోత్సహమే మూలం. వాళ్లు నన్ను ఎంకరేజ్ చేశారు. సినిమా షూటింగ్ కోసం మా నాన్న సుమారు 90 రోజుల పాటు నాతోనే ఉన్నారు. సీనియర్ నన్ను పరిచయం చేసేవారు.

**❖ ఏం చదువుతున్నావ్? స్కూల్‌లో బుల్లిరాజు లాంటి పిల్లాడివా?**

నేను బావాయిపాలెం ప్రైవేటు స్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్నాను. స్కూల్‌లో ఎక్కువగా మా ఫ్రెండ్స్‌తో సరదాగా ఉంటాను. ఈ మేనరిజమ్ నాకు సినిమా నటనకు ఎంతో ఉపయోగపడింది. స్కూల్‌లో ఎప్పుడూ గుడ్ బాయ్ నే. కబడ్డీ, కోకో ఆటలు బాగా ఆడేవాడిని. నా పుట్టినరోజు జూలై 7.

**❖ సినిమాలో బాగా నటించావు.. నటనలో శిక్షణ తీసుకున్నావా..?**

నటనలో శిక్షణ తీసుకోలేదు. దర్శకుడు అనిల్ సార్ చెప్పినట్టు చేసేవాడిని. నటనలో మెళకువలు ఆయనే నేర్పించారు. నాకు డాన్స్ డ్రాయింగ్ అంటే చాలా ఇష్టం.

**❖ సినిమాల ధ్యాసలో పడి చదువు..?**

గత ఆగస్టు నుంచి స్కూల్‌కు వెళ్లలేదు. నిన్ననే స్కూల్‌కు వెళ్లాను. చదువులో ముందుంటాను. ఫ్రెండ్స్ రేవంత్ అని పిలిచేవారు. ఇప్పుడేమో బుల్లిరాజు అంటున్నారు. ఈ ఫీలింగ్ గొప్పగా హ్యాపీగా ఉంది.

**❖ ఇంకా సినిమాల్లో ఛాన్స్ వస్తే..?**

సంక్రాంతి సినిమా తర్వాత 15 వెబ్ సిరీస్, 4 సినిమాలలో అవకాశాలు వచ్చాయి. చదువుకు ఆటంకం కాకూడదని మా మమ్మీ, డాడీ నిర్ణయం. అనిల్ సార్ నా గాడ్‌ఫాదర్. ఆయనే నాకు యాక్టర్‌గా లైఫ్ ఇచ్చారు. ఆయన మూవీలకే నా తొలి ప్రాధాన్యం.

**❖ పెద్ద హీరోలను కలిశావా..?**

సీనియర్ నటులు విక్టరీ వెంకటేష్ సార్‌తో 62 రోజుల షూటింగ్ చాలా సరదాగా సాగింది. సెట్‌లో అందరూ నన్ను ఎంకరేజ్ చేసేవారు. వారి నుంచి ఎన్నో విషయాలు నేర్చుకొన్నాను.

**❖ ఎలాంటి సినిమాలంటే ఇష్టం..?**

మా మావయ్య మోహన్ రాజేష్‌తో కలసి ఎక్కువగా సినిమాలకు వెళుతుంటాను. ప్రతి శనివారం ఆయనే నన్ను సినిమాలకు తీసుకువెళ్తుండేవారు. మా డాడీతో కూడా వెళతా. కామెడీ మూవీస్ అంటే చాలా ఇష్టం,

**❖ తొలి సినిమా అనుభవం ఎలా ఉంది?**

అనిల్ సార్ దర్శకత్వంలో సినిమా అనగానే ఎగిరి గంతేశాను. కానీ తర్వాత విక్టరీ వెంకటేష్ గారు హీరో అని తెలియగానే తొలుత గాబరా పడ్డాను. కానీ షూటింగ్‌లో వెంకటేష్ గారు నన్ను దగ్గరకు తీసుకొని ఎలా నటించాలో చక్కగా వివరించేవారు. సినిమా షూటింగ్ కేరళ, తమిళనాడు. అరకు, హైదరాబాదులో చిత్రీకరించారు. సాంగ్ మాత్రం ఉత్తరప్రదేశ్‌లో షూట్ చేశారు. సుమారు 62 రోజులు పాటు ఈ షూటింగ్‌లో పాల్గొన్నాను.

**❖ నటనతో పాటు ఇంకా ఏమేమి ఇష్టం..?**

నాకు డ్రాయింగ్, డాన్స్ అంటే చాలా ఇష్టం. ఐ యామ్ ఎ పెట్ లవర్. పక్షులంటే చాలా ఇష్టం, నా ఫేవరెట్ బర్డ్ సన్‌ఫ్లవర్ కన్యూర్. ఫిషెస్ పెంచడమంటే కూడా ఇష్టమే.

**❖ రీసెంట్‌గా చూసిన సినిమా?**

సంక్రాంతికి వస్తున్నా సినిమా నేను నటించిన చిత్రం. దీనికి ముందు చూసిన చిత్రాలంటే లక్కీభాస్కర్, అమరన్. మట్కా, చాలా సినిమాలు చూశాను.

**❖ ఫ్యూచర్ ప్లాన్ సినిమాలా.. చదువా?**

భవిష్యత్‌లో డాక్టర్ కావాలన్నదే నా కోరిక. అనుకోకుండా నటుడిని అయ్యాను. కానీ డాక్టర్ అంటేనే నాకు ఇష్టం.

హీరో, హీరోయిన్లు చాలామంది ముందు డాక్టర్లు అయ్యాక యాక్టర్లు అయ్యారు. రాజశేఖర్, శ్రీలీల ఇలా. మన బుల్లిరాజు ముందే యాక్టర్.. తర్వాత డాక్టర్ కావాలని కోరుకొంటున్నాడు. ఆల్ ది బెస్ట్ బుల్లిరాజు..

**- నిడమర్రు, ఆంధ్రజ్యోతి**

### భీమవరంలో నేడు సక్సెస్ మీట్


సంక్రాంతికి వస్తున్నాం సినిమా సక్సెస్ మీట్ ఆదివారం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించనున్నారు. దర్శకుడు అనిల్ రావిలపూడి, హీరో వెంకటేష్, హీరోయిన్లు, మిగతా నటులతో బుల్లిరాజు కూడా సందడి చేయనున్నాడు.



---

సండే స్పెషల్

# ఉసురు తీస్తున్న ఒత్తిడి



**నీళ్ల గ్లాసులో పడిన అల్పప్రాణి చీమ సైతం ఆఖరి క్షణం వరకూ ప్రాణం కాపాడుకోవడానికి ప్రయత్నిస్తుంది. పిల్లల భవిష్యత్ తీర్చిదిద్దడానికి తల్లిదండ్రులు ఎంతో కష్టపడుతుంటే అవగాహన లేమి, క్షణికావేశంలో యువత, బాలల బలవన్మరణాలు ఆందోళన కలిగిస్తోంది. భూమిపై మానవులు తప్ప ఏ ఇతర ప్రాణి క్షణికావేశంలో ఆత్మహత్యకు ప్రయత్నించిన దాఖలాలు లేవు. మేధస్సు కల్గిన మనిషికి ఎందుకు ఇంత బలహీనత.. విద్యార్థి దశ నుంచే బలవర్మణాలకు పాల్పడుతున్న పరిస్థితులపై ఆంధ్రజ్యోతి అందిస్తున్న ఆదివారం ప్రత్యేక కథనం.**

**- పాలకొల్లు, ఆంధ్రజ్యోతి**

» **పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో డిప్రెషన్**

» **మార్కులు, ర్యాంకుల భయం**

» **తల్లిదండ్రులకు భయపడి పిల్లల బలవన్మరణాలు**

పిల్లలకు ఉన్నతమైన జీవితం అందించాలనే లక్ష్యంతో తల్లిదండ్రులు ఆర్థిక కష్టాలను ఎదుర్కొంటూనే ఆప్యాయతను సైతం పక్కన పెట్టి కేజీ నుంచి పీజీ వరకు హాస్టళ్లలో బందీలుగా చేస్తున్నారు. మానసిక పరిపక్వత లేని దశలో పిల్లలు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. చదువు సరిగ్గా అబ్బడం లేదనో.. అనుకున్న లక్ష్యం చేరుకోలేమని తల్లిదండ్రులు నుంచి మాట పడాల్సి వస్తుందన్న భయంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇటీవల ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి ఉరి వేసుకోవడం కలకలం రేపింది. నిడదవోలు గ్రామానికి చెందిన వైద్య విద్యార్థి తీవ్ర మనోవేదనతో ఆత్మహత్యకు పాల్పడడం ఎందరినో కలచి వేసింది.

### అమ్మా నాన్నల అంచనాలు..

ఇటీవల పలువురు విద్యార్థుల ఆలోచనా సరళి మారుతుంది. అమ్మానాన్నల అంచనాలు అందుకోలేకపోతున్నామనీ, తనను అర్థం చేసుకునే వాళ్లు లేరని, కావాలసినంత ప్రేమ, అప్యాయతలు దొరకడం లేదని హైస్కూల్ స్థాయి నుంచే విద్యార్థులు తమ భావాలను వ్యతిరేక దృష్టితో ఆలోచిస్తూ కుంగిపోతున్నారు. ఇవి తట్టుకోలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.

### గంటకు ఒకరి ఆత్మహత్య..!

జాతీయ క్రైం బ్యూరో రికార్డుల ప్రకారం దేశంలో గంటకు ఒకరు బలవన్మరణానికి పాల్పడుతున్నారు. వివిధ కారణాలతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురై డిప్రెషన్‌లోకి వెళ్లిన విద్యార్థులు ఇలా ఆత్మహత్యకు పాల్పడుతున్నారు.

### ప్రతి పది మందిలో నలుగురు..

ఆత్మహత్యలకు పాల్పడుతున్న ప్రతీ పది మంది విద్యార్థులలో నలుగురు తీవ్ర ఒత్తిడి, కుంగుబాటు కారణంగా ఆత్మహత్యకు పాల్పడుతున్నారని సెంట్రల్ ఫర్ స్టడీ, డెవలప్ మెంట్ సొసైటీ సర్వేలో తేలింది. ఇటీవల ప్రధాని మోదీ తన ప్రసంగంలో యువత నిరాశను అణిచి పెట్టుకోవడం మాని బయటకు చెప్పుకోవ డమే సరైన పద్ధతి అని పిలుపునివ్వడం గమనార్హం.

### ప్రాణం తీస్తున్న పోటీ..

నేటి విద్యా విధానం ముఖ్యంగా కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో విపరీతమైన పోటీతత్వాన్ని విద్యార్థులలో కలగచేయడంతో ఒత్తిడి తట్టుకోలేని విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఒక సామాజిక సర్వేలో తేలింది. విచిత్రం ఏమిటంటే ఐఐటీ, నీట్ వంటి ప్రవేశ పరీక్షలకు సిద్ధమవుతున్న తెలివైన విద్యార్థుల్లో పలువురు బలవన్మరణాలకు గురవుతున్నారు.

### ఆధిపత్య ధోరణి..

ఇటీవల పలు విద్యాసంస్థలు ర్యాంకుల ఆధిపత్య పోరులో అనారోగ్య వాతావరణాన్ని కల్పిస్తున్నాయని మేధావి వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఇటువంటి పోకడలపై ప్రభుత్వం దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

### ఒత్తిడిని ఎదుర్కోవడం ఇలా..

పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులను ఉపాధ్యాయులు గమనిస్తూ ఉండాలి. ముభావంగా ఉండే పిల్లలను గుర్తించి కౌన్సెలింగ్ ఇవ్వాలి. స్నేహితులు కుటుంబ సభ్యులు ఇటువంటి విద్యార్థులతో సన్నిహితంగా మెలగాలి. అవసరం మేరకు మానసికంగా ఇబ్బంది పడుతున్న విద్యార్థులకు వైద్య నిపుణులతో కౌన్సెలింగ్ ఇప్పించాలి.

### కౌన్సెలింగ్ ఇవ్వాలి

డిప్రెషన్‌లో ఉన్న విద్యార్థులలో మార్పు ఒక్కసారిగా సాధ్యం కాదని, విద్యార్థులు చెప్పే కారణాల ఆధారంగా కౌన్సెలింగ్ ఇవ్వడం ఉపయోగకరమని మానసిక విశ్లేషకులు చెబుతున్నారు. అవసరమైన సహాయ కేంద్రాలు ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయి.

విద్యార్థులకు మానసిక, భౌతిక అవసరాలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిశీలించాలి. ర్యాంకులతో పాటు మానసిక, వ్యాయామ, విద్యనందించాలి. అప్పుడే విద్యార్థుల్లో బలవన్మరణాలు తగ్గుతాయని పరిశీలకులు సూచిస్తున్నారు.

బాల్యం నుంచే విద్యార్థులలో కొంత ఒత్తిడి ఉంటుందని మానసిక శాస్త్ర నిపుణులు చెబుతున్నారు. ఇప్పుడు స్థాయికి మించడంతో తెలిసీతెలియని వయసులో బలవన్మరణాలకు కారణమవుతోంది. ఐఐటీ సీటు కోసం 6వ తరగతి నుంచే ఒత్తిడి పెంచుతున్నారు.

ప్రపంచ వ్యాప్తం గా 10 - 19 ఏళ్ల వయస్సున్న ప్రతీ ఏడుగురిలో ఒకరు మానసిక సమస్యతో బాధపడుతున్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. 15 - 29 వయస్సు వారిలో మరణానికి కారణం ఆత్మహత్యలే కావడం ఆందోళన కలిగిస్తోంది.

క్రైం రికార్డు బ్యూరో అంచనా ప్రకారం దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో 33 శాతం ఆత్మహత్యలు పెరిగాయి. 2017 లో దేశవ్యాప్తంగా 995మంది ఆత్మహత్య చేసుకోగా 2020లో 12526, 2021లో 13,089కి చేరాయి. గత ఏడాది 56529 మంది యువత ఆత్మహత్యకు పాల్పడ్డారు.

### డిప్రెషన్‌లో ఇలా..

పాఠశాల స్థాయి నుంచి తీవ్ర మానసిక ఒత్తిడికి గురైన విద్యార్థులు ఇంటి నుంచి పారిపోవడం, ముభావంగా ఉండడం, నలుగురితో కలవకపోవడం గమనించవచ్చని మానసిక వైద్యులు చెబుతున్నారు. ఇంట్లో వాళ్లే కాకుండా స్నేహితులు సైతం తనను తక్కువగా చూస్తున్నారనే భావనలో ఉంటారు. ఇలా డిప్రెషన్ నుంచి బయట పడకపోతే ఆత్మహత్యే శరణ్యమనే భావనకు వెళతారని మానసిక విశ్లేషకులు చెబుతున్నారు.

### యువతుల్లో ఆరోగ్య సమస్యలు

ఇటీవల తెలుగు రాష్ట్రాలలోని పలు కార్పొరేట్ కళాశాలల్లో విద్యార్థినుల హాస్టళ్లను అధికారులు తనిఖీ చేసినప్పుడు అనేక దారుణాలు వెలుగు చూశాయి. అపరిశుభ్ర వాతావరణం, టాయిలెట్ నిర్వహణలో వైఫల్యం, చివరకు ఆడపిల్లలు వినియోగించే శానిటరీ నేప్‌కిన్‌లు సైతం అందుబాటులో ఉంచకపోవడం, కళాశాలల్లో చదివే యువతలో యూరిన్ సంబంధ ఆరోగ్య సమస్యలు గుర్తించడం ఆందోళన కలిగించాయి

### 8 శాతం విద్యార్థులే..

దేశంలో వెలుగు చూస్తున్న ఆత్మహత్యలలో 8శాతం మంది విద్యార్థులే ఉంటున్నారనీ వివిధ గణాంకాలు సూచిస్తున్నాయి. మొత్తంగా ప్రైమరీ స్థాయి నుంచి కళాశాల స్థాయి వరకూ కార్పొరేట్ విద్యాసంస్థలలో చదువుతున్న విద్యార్థులలోనే అధిక శాతం బలవన్మరణాలు వెలుగు చూస్తున్నాయని వివిధ నివేదికలు తెలుపుతున్నాయి.

### ప్రధాన కారణాలు ఇవే..

విద్యార్థులలో అస్థిర ఆలోచనలు డిప్రెషన్ కలిగిస్తున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు..

- అస్థిర ఆలోచనలు.
- సరైన సంబంధాలు లేకపోవడం.
- సరిగ్గా చదువుకోక పోవడం.
- ఎంత చదివినా గుర్తుండక పోవడం.
- మార్కుల శాతం తగ్గడం.
- ఉద్యోగం వస్తొందో లేదో అపనమ్మకం.

---



భీమవరంలో రిపబ్లిక్ డే వేడుకలకు సిద్ధమైన సభా ప్రాంగణం, ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ముస్తాబైన వేదిక

# గణతంత్ర వేడుకలకు వేదికల ముస్తాబు

ఏలూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలో గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కలెక్టరేట్‌ను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆదివారం ఉదయం 9 గంటలకు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జాతీయ పతాకావిష్కరణ చేస్తారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రగతి శకటాల ప్రదర్శన నిర్వహిస్తారు. అనంతరం 11 గంటలకు ఉత్తమ అధికారులకు, సిబ్బందికి ప్రశంసాపత్రాలను బహూకరిస్తారు.

● భీమవరం టౌన్: కలెక్టరేట్ గ్రౌండ్‌లో నిర్వహించే గణతంత్ర వేడుక ఏర్పాట్లను శనివారం సాయంత్రం జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు పరిశీలించారు. వేదికలు, గ్యాలరీ, 14 స్టాల్స్, వివిధ శాఖల ప్రగతి శకటాలను ఏర్పాటు చేశామన్నారు. వేడుకలను ఎక్కువ మంది ప్రత్యక్షంగా వీక్షించేందుకు ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండాలని జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. ఆర్డీవో కె.ప్రవీణ్‌కుమార్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.


235 అడుగుల జాతీయ పతాక స్తూపం

### జాతీయ పతాక స్తూపం

పెదవేగి, జనవరి 25(ఆంధ్రజ్యోతి) : ప్రజల్లో జాతీయ భావాన్ని, దేశభక్తిని పెంపొందించడమే లక్ష్యంగా భారీ జాతీయ పతాకాన్ని ఏర్పాటు చేశామని బీజేపీ ఏలూరు పార్లమెంట్ కన్వీనర్ కట్నేని కృష్ణప్రసాద్ తెలిపారు. భోగాపురంలో జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన 235 అడుగుల జాతీయ పతాక స్తూపం దగ్గర 2016 ఆగస్టు 15న తొలిసారి జాతీయ పతాకాన్ని ఎగురవేశామని ఆయన చెప్పారు. గణతంత్ర, స్వాతంత్ర్య దినోత్సవం జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్నామని తెలిపారు.



ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో గణతంత్ర వేడుకల రిహార్సల్ పరిశీలిస్తున్న ఎస్పీ కిశోర్

# గణతంత్ర వేడుకల రిహార్సల్

ఏలూరు క్రైం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఏలూరులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో గణతంత్ర వేడుకలకు ముందుగా శనివారం రిహార్సల్ నిర్వహించారు. ఎస్పీ కేపీఎస్ కిశోర్ స్వయంగా రిహార్సల్స్ పరిశీలించారు. పోలీస్ సిబ్బంది, హోంగార్డ్స్, ఎన్‌సీసీ క్యాడెట్స్ రిహార్సల్స్ నిర్వహించారు. ఎస్పీ వీఐపీ హోదాలో కార్యక్రమానికి హాజరై జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం పోలీస్ పరేడ్‌ను పరిశీలించారు. పోలీస్ సిబ్బంది గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ కేపీఎస్ కిశోర్ మాట్లాడుతూ జనవరి 26న ఉదయం ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి హాజరై జాతీయ జెండా ఆవిష్కరిస్తారు. ప్రభుత్వానికి చెందిన వివిధ శాఖలు రూపొందించిన శకటాలు ఒకదాని వెనుక ఒకటి వచ్చేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎటువంటి అసౌకర్యం లేకుండా కూర్చోడానికి సదుపాయాలు ఏర్పాటు చేయాలని, మంచినీళ్ల ఏర్పాటు చేయాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం విద్యార్థులకు తగిన ఏర్పాట్లు ఇతర అధికారుల సమన్వయంతో చేయాలన్నారు. ఈ రిహార్సల్స్‌లో ఎస్పీతో పాటు ఏఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు, ఏఆర్ ఏఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ఆర్ఐ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీస్ పెరేడ్ గ్రౌండ్ చుట్టూ ప్రత్యేక పోలీసు బలగాలతో గస్తీ ఏర్పాటు చేశారు. గ్రౌండ్‌కు వచ్చే ప్రతి ఒక్కరిని డిటెక్టర్లతో పరిశీలించేందుకు ఏర్పాట్లు చేశారు. మరోవైపు పోలీసు జాగిలాలతో వీఐపీలు వచ్చే మార్గాలు, పరేడ్ గ్రౌండ్, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ముందస్తుగా అన్ని చర్యలను చేపట్టారు.


జెండాలు సిద్ధం చేయిస్తున్న సుభాని

# కీర్తి పతాకం

**జాతీయ జెండాలు తయారుచేసి ఉచితంగా పంపిణీ చేస్తున్న టైలర్**

ఏలూరు రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ పతాక ఔన్నత్యాన్ని నేటి తరానికి చాటి చెప్పాలన్న ఆలోచనతో జాతీయ జెండాలను కుట్టి ప్రభుత్వ కార్యాలయాలకు, విద్యా సంస్థలకు ఉచితంగా అందజేస్తున్నాడు ఓ సామాన్య టైలర్. ఏటా జనవరి 26, ఆగస్టు 15న జాతీయ జెండాలను పంచి ప్రతి ఒక్కరిలో దేశభక్తి స్ఫూర్తి నింపుతున్నారు. బాపులపాడు మండలం మల్లపల్లి గ్రామానికి చెందిన సుభానీ ఏలూరులో కుట్టుశిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు వేలాది జెండాలు విద్యార్థులు, విద్యాసంస్థలకు అందించారు. పింగళి జీవితంపై పాటలు రాయించి ప్రచారోద్యమాన్ని చేపడుతున్నారు. ఘంటసాల స్వరపరిచి ఆలపించిన దేశభక్తి గీతాలతో పాటల కచేరీలు కూడా నిర్వహిస్తున్నారు. జనవరి 26 గణతంత్ర దినోత్సవం సందర్భంగా సుమారు రూ.60 వేల ఖర్చుతో 5వేల జాతీయ పతాకాలను మూడు సైజుల్లో రూపొందించి పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉచితంగా పంపిణీ చేశారు. కొన్నేళ్ల క్రితం జాతీయ పతాకం కొందామని దుకాణానికి వెళితే చిన్నజెండా రూ.100, పెద్దసైజు రూ.200 చెప్పడంతో జెండా ఇంత వెచ్చించి కొనలేని వారి పరిస్థితి ఏమిటని ఆలోచించి తానే జెండాలు తయారుచేసి ఉచితంగా పంపిణీ చేయాలని నిర్ణయించుకున్నానని సుభానీ తెలిపారు. ఓ పాఠశాలలో పింగళి గురించి విద్యార్థులు చెప్పలేకపోయారు. భావి తరాలకు ఆయన చరిత్రను చెప్పడం కోసం పింగళి చెక్కిన శిల్పం పేరిట జాతీయ పతాక విశిష్టతను వివరిస్తూ పుస్తకాన్ని రచించినట్లు తెలిపారు. జెండా రూపశిల్పి పింగళి వెంకయ్యకు భారతరత్న ఇచ్చి గౌరవించాలని సుభాని కోరుతున్నారు.

---



## దోమల పొగమంటే కాల్చేసింది

**పిట్టలోళ్ల గుడిసెలు దగ్ధం**

**ఆస్పత్రిలో ఆరుగురు**

మండవల్లి జనవరి 25(ఆంధ్రజ్యోతి): భైరవపట్నం పరిధిలోని ప్రత్తిపాడు స్టేజీ వద్ద సుమారు 25 కుటుంబాలకు చెందిన పిట్టలోళ్ల గుడిసెలు శుక్రవారం రాత్రి క్షణాల్లో దగ్ధమయ్యాయి. నెల్లూరు, చెన్నై ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చి చేపల చెరువులపై పిట్టలు వాలకుండా కాపలా కాసి పొట్టపోసుకుంటున్నారు. కుటుంబ సభ్యులతో తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న గుడిసెల్లో గాఢనిద్రలో మునిగిన సమయంలో దోమల నివారణ కోసం వెలిగించిన పొగమంట బట్టలకు అంటుకుని గ్యాస్ బండ పేలింది. పిట్టలను బెదిరించేందుకు తుపాకీలలో వాడే మందు కూడా ఉండడంతో పేలుడుతో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో బయటకు పరుగులు తీశారు. పది మంది గాయపడగా ఇద్దరు చిన్నారులతో పాటు మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఇద్దరు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి, మరో నలుగురు ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

సంఘటన స్థలాన్ని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ శనివారం సందర్శించి బాధిత కుటుంబాలకు ఆర్థికసాయాన్ని అందించారు.


కాలి బూడిదైన సామగ్రి

## ద్వారకాతిరుమల మద్యం షాపులో చోరీ

ద్వారకాతిరుమల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపులో గుర్తుతెలియని వ్యక్తులు రూ.లక్ష నగదు, మూడు మద్యం సీసాలు అపహరించారు. ఎస్ఐ సుధీర్ తెలిపిన వివరాల ప్రకానం శుక్రవారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో దుకాణం షెడ్‌పై రేకులను తొలగించి ఇద్దరు వ్యక్తులు ప్రవేశించారు. కౌంటర్లో రూ.లక్ష నగదు, 3 మద్యం బాటిళ్లను దొంగిలించారు. శనివారం ఉదయం దుకాణం తెరిచిన సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీసీ కెమెరా దృశ్యాలు పోలీసులు పరిశీలిస్తున్నారు.



కైకలూరు బైక్ ర్యాలీలో పాల్గొన్న ఐజీ అశోక్‌కుమార్, ఎంపీ పుట్టా మహేశ్, ఎమ్మెల్యే కామినేని

## హెల్మెట్ ధరించి ప్రాణ రక్షణ పొందాలి : ఐజీ

కైకలూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): వాహనదారులు హెల్మెట్లు ధరించి ప్రమాదాల బారిన పడకుండా రక్షణ పొందాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. శనివారం జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా కైకలూరులో హెల్మెట్లపై అవగాహన కార్యక్రమాన్ని ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక సీఎస్ఆర్ గార్డెన్ నుంచి ట్రావెలర్స్ బంగ్లా వరకు వేలాది ద్విచక్ర వాహనాలపై హెల్మెట్లు ధరించి ర్యాలీ నిర్వహించారు. మార్గమధ్యలో ఏలూరురోడ్డు సెంటర్లోని పోలీసు అవుట్‌పోస్టును ఐజీ, ఎస్పీ ప్రతాప్‌శివకిశోర్ ప్రారంభించారు. అనంతరం ఐజీ మాట్లాడుతూ వాహనదారులు నిబంధనలు పాటిస్తే మరణాలు తగ్గుతాయని ప్రతీ ఒక్కరూ హెల్మెట్‌ను ధరించాలన్నారు. హెల్మెట్ లేని వాహనదారుడికి రూ.వెయ్యి జరిమానా విధించనున్నట్టు ఆదేశించిందన్నారు. ఎస్పీ ప్రతాప్‌కిశోర్ మాట్లాడుతూ నిబంధనలు ప్రకారం హెల్మెట్, కార్లలో సీటు బెల్టులను ధరించాలన్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలు చైతన్యంతోనే ప్రమాదాల నివారణ సాధ్యపడుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే కమ్మిలి విఠలరావు, టీడీపీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, డీఎస్పీ శ్రావణ్‌కుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు. అనంతరం కైకలూరు పోలీసుస్టేషన్ భవనం వెనుక వైపు ఉన్న ఖాళీ ప్రదేశంలో స్వామి వివేకానంద విగ్రహానికి ఐజీ, ఎస్పీ పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ఎమ్మెల్యే కృష్ణప్రసాద్‌కు రూ. 15 లక్షల చెక్కును అందజేస్తున్న అజయ్‌బాబు

## అగస్త్యేశ్వరస్వామి దేవస్థానానికి రూ.15 లక్షల విరాళం

పెడన, జనవరి 25 (పెడన): పట్టణంలోని గంగా పార్వతి సమేత అగస్త్యేశ్వరస్వామి దేవస్థానానికి కలిదిండికి చెందిన పారిశ్రామికవేత్త లక్ష్మీపురపు అజయ్‌బాబు రూ.15 లక్షల విరాళం చెక్‌ను అందించారు. దేవస్థానంలో ప్రేయర్ రూమ్, వాటర్ ట్యాంకు నిర్మాణ నిమిత్తం ఈ విరాళం ఇచ్చారు. బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, దేవస్థానం అభివృద్ధి కమిటీ చైర్మన్ బత్తి ప్రసాద్ సమక్షంలో శనివారం టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌కు చెక్కును అందజేశారు. అజయ్‌బాబు, ఎమ్మెల్యే కృష్ణప్రసాద్‌లను దేవస్థాన అభివృద్ధి కమిటీ సభ్యులు సన్మానించారు.

## వసతి గృహాల విద్యార్థులకు సాంకేతికతతో కూడిన విద్య

**బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి నాగరాణి**

ముదినేపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వెనుకబడిన తరగతుల వసతి గృహాల్లో విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఏలూరు జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఆర్వీ నాగరాణి తెలిపారు. ముదినేపల్లిలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో ఆధునీకరించిన ఎస్ఆర్ శంకరన్ రిసోర్స్ సెంటర్‌ను శనివారం సాయంత్రం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం వసతి గృహాల విద్యార్థుల్లో కూడా సాంకేతిక నైపుణ్యం పెంపొందించాలన్న నిర్ణయంతో ఈ రిసోర్స్ సెంటర్‌లను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు ఆధునిక సాంకేతికతతో కూడిన విద్యను అందించేందుకు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రిసోర్స్ సెంటర్ నిర్వహణలో హాస్టల్ ఆఫీసర్లు జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూజివీడు బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ అక్కారావు, స్థానిక వసతి గృహ వెల్ఫేర్ ఆఫీసర్ బి. సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



రిసోర్స్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న నాగరాణి

# దోమల పొగమంటే కాల్చేసింది

» విషాదం నింపిన పిట్టలోళ్ల గుడిసెల దగ్ధం ఘటన

» ఆస్పత్రిలో ఆరుగురు

మండవల్లి జనవరి 25(ఆంధ్రజ్యోతి): మండవల్లి మండలం భైరవపట్నం పరిధిలో ని ప్రత్తిపాడు స్టేజి వద్ద సుమారు 25 కుటుంబాలకు చెందిన పిట్టలోళ్ల గుడిసెల దగ్ధం ఘటన శుక్రవారం రాత్రి అంధకారంలో జరిగింది. బతుకు దెరువు కోసం నెల్లూరు, చెన్నై ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చి చేపల చెరువులపై పిట్టలు వాలకుండా వలలతో కాపలా కాసి సైసాపైనా పోగేసుకుంటూ ముందుకు సాగుతున్న వారి జీవితాలు అగ్నిప్రమాద ఘటనలో విషాదఛాయలు నెలకొన్నాయి. తమ కుటుంబ సభ్యులతో తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న గుడిసెల్లో గాఢనిద్రలో ఉన్న సమయంలో దోమల నివారణ కోసం వెలిగించిన పొగమంటి బట్టలకు అంటుకుని గ్యాస్ బండ పేలింది. పిట్టలను బెదిరించేందుకు తుపాకీలలో వాడే మందు కూడా ఉండటంతో పేలుడు శబ్దం విన్పించి ఆకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో బయటకు పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో పది మంది వరకు గాయాలు కాగా వీరిలో ఇద్దరు చిన్నారులతో పాటు మరో నలుగురు చిక్కుకుని శరీరం దారుణంగా కాలిన దృశ్యాలు కన్నీరు పెట్టించాయి. కళ్ల ముందే సిరి పక్షిలోనే మంటలు ఒక్కసారిగా ఊహించని రీతిలో చెలరేగి భయభ్రాంతులకు గురిచేసింది. ఈ ప్రమాదంలో పదిమంది గాయపడగా, ఆరుగురు పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. ప్రమాదంలో క్షతగాత్రులు ఇద్దరు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మరో నలుగురు ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.



అగ్ని ప్రమాదంలో కాలి బూడిదైన సామగ్రి

**ఎంపీ, ఎమ్మెల్యే ఆర్థిక సాయం**

సంఘటన స్థలాన్ని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ యాదవ్, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ శనివారం సందర్శించి బాధిత కుటుంబాలకు ఆర్థికసాయాన్ని అందించారు.



మొక్క నాటుతున్న నూజివీడు ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ అమరేంద్రకుమార్

## నూజివీడు ట్రిపుల్ ఐటీలో మెగా ప్లాంటేషన్

నూజివీడు టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలోని నూజివీడు క్యాంపస్‌లో పవర్ గ్రిడ్ ఆధ్వర్యంలో మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఎస్.అమరేంద్రకుమార్ మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 'అమ్మ పేరున ఒక మొక్క' నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పవర్ గ్రిడ్ సీనియర్ జనరల్ మేనేజర్ కె.నాగమోహనరావు, ఏవో లక్ష్మణరావు, డీఎస్‌డబ్ల్యూ దుర్గాభవాని, బ్రహ్మాజీలు తదితరులు పాల్గొన్నారు.







నూజివీడు పట్టణంలో ఓటర్ల దినోత్సవ ర్యాలీ.. కలిదిండిలో సీనియర్ ఓటర్లకు సత్కారం.. ముదినేపల్లి మండలం చేవూరులో శతాధిక ఓటరు మాధవరావుకు సత్కారం

# ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటర్లపాత్ర కీలకం

» నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ » ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం » అవగాహన ర్యాలీలు, సీనియర్ ఓటర్లకు సత్కారం

నూజివీడు టౌన్/చాట్రాయి/ముసునూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటర్లపాత్ర అత్యంత కీలకమని నూజివీడు సబ్‌కలెక్టర్ స్మరణ్‌రాజ్ అన్నారు. నూజివీడులో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా పట్టణంలో ఓటు ఆవశ్య కతను తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. నూజివీడు పట్టణ సీఐ సత్యశ్రీనివాస్, ఎస్ఐ జ్యోతిబసు, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు. చాట్రాయి మండలంలో తహసీల్దార్ ప్రశాంతి ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం నుంచి సెంటర్ వరకు ర్యాలీ జరిపి అనంతరం మానవహారం, ప్రతిజ్ఞ నిర్వహించారు. పోరంపూడి శ్రీనివాసరావు, ఎస్ఐ గఙపతిరావు, బీజేపీ నాయకుడు ఆదిమూలం శర్మ అధికారులు, పాల్గొన్నారు. చాట్రాయి, చనుబండ, జనార్దనవరం, పోలవరం తదితర గ్రామాల్లో ఓటర్ల దినోత్సవం సందర్భంగా టీడీపీ నాయకులు సీనియర్ ఓటర్లను సన్మానించారు. మాదాను చంద్రశేఖర్, మాదాను చిన్న పుల్లయ్య, పామర్తి నాగరాజు, బలుపూరి రత్తయ్య, గొడవర్తి దాసు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ముసునూరు మండలంలోని ముసునూరు జడ్పీ పాఠశాలలో సీనియర్ ఓటర్లను తహసీల్దార్ రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు సన్మానించారు. రమణక్కపేట, లోపూడి పాఠశాలల్లో కూటమి నాయకులు, ఉపాధ్యాయులు సీనియర్ ఓటర్లను సన్మానించారు. అనంతరం ఓటరు ప్రతిజ్ఞను నిర్వహించారు. హెచ్ఎం రామకృష్ణారావు, ఎ. సునీల్, టీడీపీ నాయకులు లక్ష్మణాపు కాంతారావు, నక్కా చెన్నారావు పాల్గొన్నారు.

**కైకలూరు నియోజకవర్గంలో..**

కలిదిండి/ముదినేపల్లి/కైకలూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కలిదిండి తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం సీనియర్ ఓటర్లను తహసీల్దార్ రామకృష్ణ, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువత తమ ఓటును నమోదు చేయించుకోవాలన్నారు. అనంతరం కలిదిండి జడ్పీ హైస్కూల్‌లో ఓటర్ల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన ముగ్గుల, డ్రాయింగ్, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కూటమి నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ముదినేపల్లి మండలంలోని పెదపాలపర్రు, ముదినేపల్లి, వడాలి జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహించిన ఓటర్ దినోత్సవ కార్యక్రమాల్లో తహసీల్దార్ సుజాని, అధికారులు పాల్గొని సీనియర్ ఓటర్లను సత్కరించారు. నూతన ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. మండలంలోని చేవూరు గ్రామంలో 103 ఏళ్ల వయస్సు గల వయోవృద్ధ ఓటరు వల్లభనేని మాధవరావును వీఆర్వో రామసుబ్బయ్య సత్కరించగా, కాకరవాడలో సీనియర్ ఓటర్లు కొంగంటి వెంకటేశ్వరరావు, విజయలక్ష్మి దంపతులను వీఆర్వో ఏడుకొండలు సత్కరించారు. పెదపాలపర్రు హైస్కూల్‌లో బొడ్డపాటి విష్ణు శ్రీషణ్ముఖ మౌళికకు ఉత్తమ బహుమతి అందజేశారు. టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, తెలుగు యువత అధ్యక్షులు దావు నాగరాజు పాల్గొన్నారు. కైకలూరు వైవీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యూత్ రెడ్‌క్రాస్ సొసైటీ, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శ్రీలత మాట్లాడుతూ భారతదేశం అత్యంత పెద్ద ప్రజాస్వామ్య దేశమన్నారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థులకు ఓటు హక్కుపై క్విజ్, వ్యాసరచన, ఎలక్యూషన్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం. విజయకుమార్, అధ్యాపక బృందం ఎం.హరిప్రసాద్, కేదారి, బి.వేదాంతం, రంగమణి, ఫిజికల్ డైరెక్టర్ ఎం.శివనాగరాజు పాల్గొన్నారు.



డ్రైనేజీలను పరిశీలిస్తున్న ఆర్డీ నాగ నరసింహారావు

## అనధికార నిర్మాణాలపై చర్యలు చేపట్టాలి

నూజివీడు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): అనధికార భవన నిర్మాణాలు, ఆక్రమణలపై నూరుశాతం ఆవరణ రుసుము విధించి చర్యలు చేపట్టాలని మునిసిపల్ శాఖ ఆర్డీ సీహెచ్ నాగ నరసింహారావు ఆదేశించారు. శనివారం మున్సిపల్ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పట్టణ పరిధిలో ఈ ఆదాయం నూరుశాతం పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాలని, మంచినీటి సరఫరాతో పాటు పట్టణ సుందరీకరణకు సీఎఫ్ఆర్ నిధులను వినియోగించుకోవాలన్నారు. తొలుత నూజివీడు పట్టణంలో డ్రైనేజీలను ఆయన పరిశీలించారు.

**ఇంజర్లమ్మ చెరువుకు చేపల పాట నిలిపివేయాలి**

ముసునూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రమణక్కపేట గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఇంజర్లమ్మ చెరువుకు చేపల పాటను నిలిపివేయాలని కూటమి నాయకులు కోరారు. శనివారం ఈవోపీ ఆర్డీ సత్యనారాయణకు కూటమి నాయకులు వినతిపత్రం అందజేశారు. టీడీపీ యువనేత రంగు శ్రీనివాసరావు, జనసేన నాయకులు పాశం నాగబాబు మాట్లాడుతూ రైతుల సాగునీటికి, పశువుల తాగునీటి కోసం గ్రామంలో ఉన్న ఏకైక చెరువు ఇది ఒక్కటేనని అన్నారు. చేపల చెరువుగా ఉపయోగించడం వల్ల రసాయనాలు వాడడంతో కలుషితం అవుతుందన్నారు. ఈ మేరకు జిల్లా పంచాయతీరాజ్ అధికారి ఇంజర్లమ్మ చెరువుకు చేపలపాట వేలం నిలిపివేసిన ఆదేశాలు జారీచేసినట్టు ఈవోపీఆర్డీ తెలిపారు.

**హిల్ స్కూల్‌కి టీచర్ల విరాళం**

ఆగిరిపల్లి,జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి హిల్ పారడైజ్ హిల్ స్కూల్ ఆవరణలో ఆరు రోజులుగా సెకం డరీ ఉపాధ్యాయులకు జరుగుతున్న ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశానికి ఏలూరు జిల్లా అకా డమిక్ మానిటరింగ్ అధికారి రెడ్డి రామారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకటి, రెండు తరగతుల విద్యార్థులకు కృత్యాధార బోధన వల్ల వారిలో అవగాహన శక్తి పెరుగుతుందని పాటు విద్యార్థులు పాఠశాలకు ఆకర్షితులవుతారన్నారు. సెకండరీ ఉపాధ్యాయులు అందరి తరఫున లక్షా అరవై ఆరువేల మూడు వందల రూపాయల విరాళాన్ని హిల్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కోనేరు సత్యవతి సాస్‌కు అందజేశారు. డాక్టర్ జి.రాధాకృష్ణ, హిల్ సీఈవో కూరపాటి అజయ్‌కుమార్, మండల విద్యాధికారులు పాల్గొన్నారు.

## వైభవంగా త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం

ముదినేపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం సింగరాయపాలెం-చేవూరుపాలెం నాయీ బ్రాహ్మణ సంఘం, కళాకారుల ఆధ్వర్యంలో స్థానిక బాలాజీమఠం ఆవరణలో శనివారం త్యాగరాజస్వామి ఆరాధన మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవ నిర్వాహకులు సింగరాయపాలెంలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం నుంచి త్యాగరాజస్వామి చిత్రపటాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి మఠం ఆవరణలో నిర్మించిన మందిరంలో ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. అనంతరం ఉభయ రంగనాథ చార్యులు ఆధ్వర్యంలో సీతారామ చంద్రస్వామికి అభిషేకాలు నిర్వహించారు. నాయీ బ్రాహ్మణ సంఘం ప్రముఖులు చింత గుంట నాగరాజు, మాదవరావు నాగేశ్వరరావు దంపతులు పూజలు నిర్వహించారు. విష్ణు సహస్రనామ పారాయణం, నాద స్వర కచేరి జరిపారు.



త్యాగరాజ స్వామి చిత్రపటం ఊరేగింపు





ముసునూరు, కలిదిండిలో మందులను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు.. పశువైద్యాధికారులు

## పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ముసునూరు/కలిదిండి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని టీడీపీ సీనియర్ నాయకులు కొల్లి గంగారామ్, తెలుగుయువత నాయకులు కొండేటి ఉదయ్ కిరణ్ అన్నారు. శనివారం ముసునూరు, గుడిపాడులో వైద్యాధికారి ఎం.వెంకట చైతన్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరాల్లో పశువులకు, జీవాలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. టీడీపీ నాయకులు గద్దె రఘుబాబు, మండలపు దుర్గారావు, మండలపు బుజ్జియ్య, నక్కా యోహాను తదితరులు పలువురు రైతులకు మందులను అందజేశారు. పశువైద్య సహాయక సిబ్బంది పాల్గొన్నారు. కలిదిండి మండలం పడమటిపాలెం, తాడినాడ గ్రామాల్లో ఉచిత పశువైద్య శిబిరాలను నిర్వహించారు. మండల పశువైద్యాధికారి ప్రహర్ష ఆధ్వర్యంలో 170 పశువులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 400 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



నూజివీడులో అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నేత నాగరాణి, తదితరులు

## ఘనంగా సంవిధాన్ గౌరవ్ దివస్ కార్యక్రమాలు

నూజివీడు టౌన్/ముదినేపల్లి/చాట్రాయి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నూజివీడు పట్టణంలోని బాపునగర్‌లో సంవిధాన్ గౌరవ్ దివస్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అంబేద్కర్ చిత్రపటానికి నూజివీడు పట్టణ బీజేపీ అధ్యక్షురాలు మల్లిపూడి నాగరాణి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు ఎం. రాజశేఖర్, మాటూరి రవికాంత్, మాగంటి వాసు, బావరాజు పుల్లారావు, దోసపాటి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు. ముదినేపల్లి మండలం పెయ్యేరులో బీజేపీ మండల అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి ఆధ్వర్యంలో సంవిధాన్ గౌరవ్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొటప్రోలు కృష్ణారావు భరతమాత, అంబేద్కర్, రాజ్యాంగ పీఠిక చిత్రపటాలకు పూలమాలలు వేసి రాజ్యాంగ ప్రాముఖ్యతను వివరించారు. కొల్లిపర నాగరాజు, రెడ్డి నాగలక్ష్మి పాల్గొన్నారు. చాట్రాయి మండలం చనుబండ, కృష్ణారావుపాలెం గ్రామాల్లో పోలింగ్ బూత్ వద్ద శనివారం భారత్ సంవిధాన్ గౌరవ దివస్ నిర్వహించారు. డాక్టర్ అంబేద్కర్, తెలుగుతల్లి చిత్రపటాలకు నాయకులు, గ్రామస్తులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బుర్రి శ్రీకర్, చిట్టిం వేణుగోపాలరావు, పంద వెంకటేశ్వరరావు, మరీశ్వరరావు, శ్రీకాంత్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



## టీటీడీకి కూరగాయల వితరణ

నూజివీడు టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): టీటీడీ అన్నదాన స్రతానికి నూజివీడు రైతులు 13 టన్నుల కూరగాయలను వితరణగా అందించారు. దేవరగుంటకు చెందిన నక్కా సత్యనారాయణ సేత్య త్వంలో రైతులు బొప్పిరి ఆనంతరాజు, నరహరిశెట్టి మధు తది తరులు నాలు గున్నర టన్నుల వంగ, ఐదు టన్నుల గుమ్మడి, మూడున్నర టన్నుల సొర తదితర కూరగాయలను అందించారు. టీటీడీ ప్రత్యేకవాహనంలో కూరగాయలను తిరుమలకు శనివారం తరలించారు.



మొక్కలను చూపుతున్న హెచ్ఎం రామకృష్ణారావు

## రమణక్కపేట పాఠశాలకు మొక్కల వితరణ

ముసునూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రమణక్కపేట జడ్పీ పాఠశాలకు గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నున్నలో ఉన్న పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా యాజమాన్యం 75 మొక్కలను శనివారం అందజేశారు. 50 పూలమొక్కలు, కదంబం, ఉసిరి, నిమ్మ, సపోటా, మామిడి 25 మొక్కలను హెచ్ఎం రామకృష్ణారావుకు సీనియర్ జనరల్ మేనేజర్ కె.నాగమోహనరావు అందజేశారు. మొక్కలను పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు సంయుక్తంగా నాటారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లిబరేషన్ నాయకుడు బక్కయ్య

## సాగు భూములకు పట్టాలు ఇవ్వాలి

ముసునూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పేదలు సాగుచేస్తున్న భూములను వెంటనే జిల్లా జాయింట్ కలెక్టర్ పరిశీలించి సాగు హక్కును కల్పించి, పట్టాలు ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ మండల కార్యదర్శి వేముల బక్కయ్య డిమాండ్ చేశారు. శనివారం రమణక్కపేటలో అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో మూడు తరాలుగా పేదలు సాగు చేసుకుంటున్న అటవీ భూములకు అధ్యతరాలు పెడుతూ సాగుహక్కు కల్పించకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఈ భూముల్లో జేసీ క్షేత్రస్థాయిలో పరిశీలించి రెవెన్యూ, ఫారెస్ట్ శాఖల జాయింట్ సర్వే చేసి, అర్హులైన పేద సాగుదారులకు పట్టాలివ్వాలా చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు ఉమ్మడి చినబాబు, నాగ వెంకటేశ్వరరావు, ఉప్పే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ నేత కుటుంబానికి సాయం

ముదినేపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పెదగొన్నూరు శివారు విశ్వనాథపాలెం గ్రామంలో గుండెపోటుకు గురై శనివారం మరణించిన టీడీపీ నాయకుడు కాగిత సుధాకరరావు (38) కుటుంబాన్ని ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొవాలి విజయ్ పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి బొర్రా బాలసాయి చారిటబుల్ ట్రస్ట్ తరఫున రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. టీడీపీ నాయకుడు బొర్రా చలమయ్య, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి పరసా ఏడుకొండలు, వీరంకి చక్రపాణి, యర్రగుద్ద గంగయ్య తదితరులు పాల్గొని సుధాకరరావు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. సుధాకరరావు అంత్యక్రియలకు అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

## 19 మందికి ఉద్యోగాలు

నూజివీడు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నూజివీడు ఎం.వి.ఆర్ జూనియర్ కళాశాలలో శనివారం జాబ్‌మేళాను నిర్వహించారు. దాదాపు ఆరు కంపెనీలు హాజరుకాగా, 52 మంది నిరుద్యోగ యువత జాబ్‌మేళాకు హాజరయ్యారు. వీరిలో 19 మందికి పలు కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ వి.రమేష్ తెలిపారు. స్కిల్‌డెవలప్‌మెంట్ స్టాఫ్ కిషోర్, రామ కృష్ణనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## బెల్లపు ఊట ధ్వంసం

నూజివీడు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ దాడుల్లో 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని సీఐ మస్తానయ్య తెలిపారు. శనివారం దేవరగుంట గ్రామంలో 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. వారిలో ఉన్న కొమ్మవరపు రామ్‌పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.